## సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ అరెస్ట్

అమరావతి, ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులను మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆంజనేయులు పనిచేశారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు. ముంబై నటి జత్వాని కేసులో ఆంజనేయులు నిందితుడిగా ఉన్నారు. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ కేసులో కూడా ఆంజనేయులు నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. నేటి వరకు బెయిల్‌కు కూడా ఆంజనేయులు న్యాయస్థానంలో పిటీషన్ వేయలేదు. ఆంజనేయులను విజయవాడకు ఏపీ పోలీసులు తీసుకురానున్నారు. జగన్ ప్రభుత్వంలో నటి జత్వానీపై వైసీపీ నేత విద్యాసాగర్ ఆమెను తీవ్ర వేధింపులకు గురిచేశాడు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముంబై వెళ్లి జత్వానీతో సహా ఆమె కుటుంబాన్ని అరెస్ట్ చేసిన సంఘటన ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది. ఓ ప్రముఖ వ్యాపారవేత్తపై జత్వాని కేసు వేయడంతోనే పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ కేసును వాపస్ తీసుకోవాలని జత్వానీపై తీవ్ర ఒత్తిడికి గురిచేశారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :52 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 23-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## పిలుపు బలంగా తాకింది.. ముగింపు పలకాల్సిన సమయం రెడీ



హైదరాబాద్, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ రాసిన లేఖపై రియాక్ట్ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. జపాన్‌లోని హిరోషిమా చారిత్రక నగరంలో నేను మీ లేఖను చదివానని ప్రస్తావించారు. అదృష్టవశాత్తూ నేను ఇక్కడ మహాత్మా గాంధీజీ విగ్రహం ఉన్న పవిత్ర స్థలాన్ని సందర్శించబోతున్నప్పుడు మీ లేఖ చదివాను, మీ స్పూర్తిదాయకమైన పిలుపు నాకు బలంగా తాకిందని ప్రస్తావించారు. గర్వించదగిన భవిష్యత్తును రూపొందించడంలో మీ ఆలోచనలు, భావాల స్పూర్తితో ముందుకు వెళ్తామన్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఇంతకీ రాహుల్‌గాంధీ.. సీఎం రేవంత్‌కు రాసిన లేఖలోని సారాంశం ఏంటి? రోహిత్ వేముల చట్టాన్ని తీసుకరావాలని లేఖలో ప్రస్తావించారు అగ్రనేత. బీఆర్ అంబేద్కర్, రోహిత్ వేముల మాదిరిగా లక్షలాది మంది ఎదుర్కొన్న కుల వివక్ష ఇకపై ఎవరు ఎదుర్కోవద్దన్నారు. కుల వివక్ష, అంటరాని తనంపై సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను లేఖలో పేర్కొన్నారు. దీనికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్న పేర్కొన్నారు రాహుల్ గాంధీ. రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ సైతం కుల వివక్షను ఎదుర్కోన్నారని ఈ విషయాన్ని రాహుల్ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ పరిస్థితి అప్పుడే కాదు.. ఇప్పటికీ ఉందన్నది రాహుల్ గాంధీ మాట. దీనిపై చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని ఇటీవల కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కోరారు. అగ్రనేత లేఖపై వెంటనే రియాక్ట్ అయ్యారు కూడా. 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాను ప్రారంభించమని న్యాయ బృందాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఏ విద్యార్థి అయినా కుల వివక్షకు గురైతే అది నిజంగా సిగ్గు చేటు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీ కులాలు ఇప్పటికే కుల వివక్షను ఎదుర్కొనే వారిలో ఉన్నారన్నారు. నేటి సమాజంలో ఇప్పటికే లక్షల మంది కుల వివక్ష బారిన పడుతున్నారు. 2016లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేముల సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన కుల వివక్ష, సామాజిక అన్యాయాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఆ సమయంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన రాహుల్‌గాంధీ, అక్కడి వర్సిటీ విద్యార్థులతో మాట్లాడిన విషయం తెల్సిందే. ఈ చట్టం అమలైతే యూనివర్శిటీల్లో విద్యార్థులకు మంచి వాతావరణం, సమాన హక్కులు, మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు అవుతాయి. కఠిన శిక్షలు, నివారణ చర్యలు అమలవుతాయి.

## భూ భారతి చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..

యాదాద్రి : యాదాద్రి జిల్లాలోని వలిగొండ మండల కేంద్రంలో భూ భారతి అవగాహన సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ ప్రజలకు భారంగా మారింది అందుకే భూ భారతి తీసుకొచ్చాం అని పేర్కొన్నారు. ఇక, నలుగురు వ్యక్తులు చేసిన చట్టమే ధరణి.. ధరణి పోర్టల్ అమలు చేసే సమయంలో వంద రోజులు రిజిస్ట్రేషన్లు జరగలేదని ఆరోపించారు. భూ భారతి చట్టం అందరి ఆమోదయోగ్యంతో చేశామని తేల్చి చెప్పారు. మే 1వ తేదీ నుంచి 28 జిల్లాలోని ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా సెలెక్ట్ చేసుకుని అమలు చేస్తాం అని మంత్రి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో భూమి లేని నిరు పేదలకు ఇందిరమ్మ భూమీ పట్టాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.. కానీ, వీఆర్ఓ వ్యవస్థ రద్దు చేశాడు అని మండిపడ్డాడు. అధికారులు భూ భారతి చట్టాన్ని దుర్వినియోగం



చేస్తే కఠి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ భూ భారతి పోర్టల్ వాళ్ల ప్రతి ఒక్కరు సులభంగా భూ సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చన్నారు.

## తెలంగాణలో ఇంటర్ ఫలితాలు.. బాలికలదే పైచేయి



హైదరాబాద్, తెలంగాణ ఇంటర్మీడియట్-2025 ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ ఫలితాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆయా ఫలితాలు వెల్లడించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను విడుదల చేశారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఒక వారం గడువు ఇస్తున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. నెల రోజుల తర్వాత ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు అంటే మే 22 నుంచి జరగనున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్, ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 9.97 లక్షల (ఫస్ట్, సెకండ్) మంది హాజరయ్యారు. ఫస్ట్ ఇయర్ 66.98 శాతం మంది పాస్ అయినట్టు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు. ఫస్ట్ ఇయర్‌కు దాదాపు 4 లక్షల 88 వేల మంది హాజరయ్యారు. అందులో బాలికలు-73.83 శాతం పాసయ్యారు. బాలురలు 57.83 శాతం పాసయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలు 5 లక్షల 5 వేల మంది హాజరయ్యారు. సెకండ్ ఇయర్ 71.37 శాతం పాసైనట్టు వెల్లడించారు. అందులో బాలికలు 74.21 శాతం కాగా, బాలురులు 57.31 శాతం పాసైనట్టు తెలిపారు. ఫస్టియర్‌లో అత్యధికంగా మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లా 48.43 శాతం విద్యార్థులు పాసయ్యారు. సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా ములుగు జిల్లా 80.12 శాతం, అత్యల్పంగా కామారెడ్డి జిల్లా 54.93 శాతంతో విజయం సాధించింది.

## పార్లమెంటే అత్యున్నతమైంది...

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటే అత్యున్నతమైందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన బిల్లులను ఉద్దేశిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. నిర్దేశిత గడవులోగా రాష్ట్రపతి అయినా, గవర్నర్లు అయినా.. బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీం కోర్టు పేర్కొన్నది. ఆ వ్యాఖ్యలను ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తప్పుపట్టారు. రాష్ట్రపతికి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థ కు లేదన్నారు. అయితే ఇవాళ మళ్లీ అదే అంశంపై ఆయన రియాక్ట్ అయ్యారు. శాసన వ్యవస్థే అత్యున్నతమైందని, రాజ్యాంగం ఎలా ఉండాలన్న దాన్ని నిర్ణయించేది ఎన్నికైన ప్రజాప్రతినిధులే అని, అంతకు మించిన అధికారం ఎవరికీ లేదని జగదీప్ ధన్‌కర్ తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన జరిగిన కార్యక్రమంలో ధన్‌కర్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టుపై చేసిన వ్యాఖ్యలకు వస్తున్న విమర్శలను కౌంటర్ చేస్తూ మరో సారి ఆయన న్యాయ వ్యవస్థను టార్గెట్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ని



సుప్రీంకోర్టు దుర్వినియోగం చేస్తున్నట్లు ఇటీవల ధన్‌కర్ ఆరోపించారు. ఆ ఆర్టికల్‌ను అణ్వాయుధ క్షిపణిగా ప్రజాస్వామ్య దళాలపై వాడుతున్నట్లు ఆయన ఆరోపించారు.

## తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండానే

కందుకూరు, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినట్లు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సభావత్ లచ్చా నాయక్, పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సభావత్ సుమన్ నాయక్‌తో పాటు వారి అనుచరులు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ గులాబీ జెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. హామీలను ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఒక్క గ్యారెంటీ కూడా సక్రమంగా అమలు చేయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడి తమ పార్టీలో చేరడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కన్న తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి మోసపోయామని లచ్చానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి పార్టీలో చేరడం తనకెంతో సంతోషంగా ఉందని వివరించారు. దీంతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. పార్టీలో పెద్దమ్మ



తండా మాజీ ఉప సర్పంచ్ రేఖ్యా నాయక్, లక్ష్మణ్ నాయక్, విజయ నాయక్ తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్, ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గం కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనేగౌని దామోదర్ గౌడ్, మహేశ్వరం మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్, డైరెక్టర్ పిట్టల పాండు ముదిరాజ్, మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, యూత్ నాయకులు తేజ నాయక్, జైపాల్, వెంకటేష్, దేవుల నాయక్, మోతిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో హైటెన్షన్ !



ఖమ్మం:ఖమ్మం జిల్లా పాల్వంచలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పెద్దమ్మ తల్లి పాలకమండలి ప్రమాణ స్వీకారంలో భట్టి, పొంగులేటి అనుచరుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ గ్రామానికి పాలకమండలిలో చోటుకల్పించలేదంటూ కేశవాపురం యువకులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు.

భారీగా మోహరించిన పోలీసులు..

ఈ క్రమంలోనే పాలకమండలి ప్రమాణస్వీకారాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తూ ఆలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకోగా.. తీవ్ర ఉద్రిక్తతల నడుమ ప్రమాణస్వీకారం చేశారు పాలకమండలి సభ్యులు. మొదట డిప్యుటీ సీఎం భట్టివిక్రమార్క అనుచరుడు జమ్ముల రాజశేఖర్ ను ఆలయ చైర్మన్ గా నియమిస్తూ సభ్యులతో కూడిన నియామకపత్రం విడుదల చేసింది దేవాదాయ ధర్మాధాయ శాఖ. అయితే ఇటీవల పాలకమండలిలో చోటు దక్కించుకుని ప్రమాణ స్వీకారానికి సిద్ధమైంది పొంగులేటి వర్గం. అయినప్పటికీ నూతన పాలకమండలి జాబితాలో తమ గ్రామానికి చోటుకల్పించకపోవడంపై కేశవాపురం గ్రామస్థులు కొద్దిరోజులుగా ఆందోళనకుదిగారు. తమ గ్రామంలో వెలసిన అమ్మవారి ఆలయ పాలకమండలిలో ఊరికి అవమానం జరిగిందంటూ నిరసనలు చేప్టటారు. ఇందులో భాగంగానే ఈరోజు పాలకమండలి ప్రమాణస్వీకారాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. అయినప్పటికీ తీవ్ర ఉద్రిక్తతల నడుమ భారీ బందోబస్తుతో పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం ముగిసింది.

## ఐపిఎస్ అధికారి అరెస్ట్ కక్ష సాధింపు చర్యే...



గుంటూరు, రాష్ట్రంలో కూటమి పాలనలో వ్యవస్థలన్నీ దిగజారుస్తున్నారని.. దుష్ట సంప్రదాయాలకు తెర లేపుతున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో నేడు జరిగిన పార్టీ పీఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ కక్ష రాజకీయాలు చేస్తున్నదని అన్నారు. ముంబై నటి జత్వానీని వేధించారంటూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయుల్ని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసిన నేపథ్యంలో స్పందించిన జగన్ రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి ప్రనజల్లోకి వెళ్లకుండా డైవర్షన్ చేస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయులును అరెస్ట్ చేయడం కూటమి కక్ష రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు.

ఇదే కేసులో మరో ఇద్దరు పోలీస్ అధికారుల పట ప్రభుత్వ తీరును కోర్టు తప్పుబట్టిందన్నారు జగన్. మొదటి సారి ఇలాంటి దుర్మార్గాలు చూస్తున్నా. ఒక వ్యక్తిని ఇరికించడానికి కేసులు క్రియేట్ చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రం ఎటువైపు వెళుందో అర్థం కావడం లేదు. రాష్ట్రంలోని వ్యవస్థలను దిగజారస్తున్నారు. దుష్ట సంప్రదాయాలకు తెర లేపుతున్నారు. ప్రభుత్వం ఇలా పోతే రాష్ట్రంలో అరాచకం తప్ప ఏం మిగలదని పేర్కొన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని కూడా టార్గెట్ చేశారని, ఎలాగైనా మిథున్‌రెడ్డిని ఇరికించాలని చూస్తున్నారన్నారు జగన్. కాలేజీ రోజుల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి ఎదురించారు. కాబట్టే పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు కక్ష పెంచుకున్నారు. లేని ఆరోపణలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఆర్పోంచారు. బాబు హయాంలో లిక్కర్ స్కాంపైనా గతంలో సీఐడీ కేసు పెట్టిందని గుర్తు చేశారు. . మనం తెచ్చిన లిక్కర్ పాలసీ విప్లవాత్మకమైందని, ప్రైవేట్ దుకాణాలు తీసేసి ప్రభుత్వమే నిర్వహించిందని చెప్పారు. లిక్కర్ అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారా? ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని పీఏసీ సభ్యులను ఉద్దేశించి జగన్ వ్యాఖ్యానించారు.

## 22 ఏళ్ల తర్వాత హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్..

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కు సర్వం సిద్ధమైంది. జీహెచ్ఎంసీలో హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. రేపు జరిగే ఎన్నికకు ఏప్రిల్ 25న కౌంటింగ్ చేసి ఫలితాల ప్రకటిస్తారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే పోలింగ్, కౌటింగ్ కు ఏర్పాట్లు చేశారు.

రేపటి ఎన్నికకు ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లకు రెండు వేరువేరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంఐఎం, బీజేపీ పార్టీల మధ్య జరగనున్న ఎమ్మెల్సీ పోటీ జరగనుంది.. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హసన్, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు బరిలోకి దిగనున్నారు.. ఎన్నికలో మొత్తం ఓటర్లు సంఖ్య 112.. అందులో కార్పొరేటర్ల సంఖ్య 81.. ఎక్స్ ఆఫీషియో సభ్యుల సంఖ్య 31 ఉంది..పార్టీల వారిగా బలాబలాలు చూస్తే.. ఎంఐఎంకు 41 కార్పొరేటర్లు, 9 ఎక్స్ ఆఫీషియో సభ్యులు మొత్తం 50 మంది ఓటర్లు ఉన్నారు. బీజేపీకి 18 కార్పొరేటర్లు, 6 ఎక్స్ ఆఫీషియో సభ్యులు మొత్తం 24 మంది ఓట్లు ఉన్నాయి. కాంగ్రెస్ కు ఏడుగురు కార్పొరేటర్లు, ఏడుగురు ఎక్స్





ఆఫీషియో సభ్యులు మొత్తం 14 మంది ఉండగా.. బీఆర్ఎస్‌కు15 కార్పొరేటర్లు, 9 ఎక్స్ ఆఫీషియో సభ్యులు మొత్తం 24 మంది ఓటర్లు ఉన్నారు. సరిపడ సంఖ్య బలం లేకున్నా తొలి సారి హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచింది బీజేపీ.. 22 ఏళ్ళ తర్వాత హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ జరగనుంది..

## సంపాదకీయం

బుధవారం 23-04-2025

# బీటలు వారుతున్న ఉక్కుచట్రం

సమగ్రత, నిష్పక్షపాతం, నైతికతలే సహజాభరణాలుగా ప్రజాస్వామ్య పరిరక్షణ భావంతో దేశాన్ని నడిపించే కార్యనిర్వాహక యంత్రాంగాన్ని నెలకొల్పడమే సివిల్ సర్వీసుల ఏర్పాటు లక్ష్యం. భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆశయం అదే. అదెంత వరకు నెరవేరింది? సివిల్ సర్వెంట్లలో సేవాభావం, ప్రజలతో అనుసంధానత తగ్గాయా? రాజకీయ నాయకుల ప్రభావానికి, ప్రలోభాలకు వారు లొంగిపోతున్నారా? నేడు సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా...భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో కేంద్ర బిందువులుగా నిలిచిన సివిల్ సర్వీసులు దేశాన్ని మోసే ఉక్కు చట్రం(స్టీల్‌ఫ్రేమ్)గా గుర్తింపు పొందాయి. సమగ్రత, కఠిన పరిశ్రమ, విజ్ఞానం వంటి లక్షణాలతో సివిల్ సర్వీస్ అధికారులు పాలనను ముందుకు నడిపించారు. అయితే దేశాభివృద్ధిలో, సామాజిక అసమానతల నిర్మూలనలో ప్రతిభ కొరవడుతోందన్న విమర్శలున్నాయి. మాజీ ఉన్నతాధికారి ఎన్‌సీ సక్సేనా చెప్పినట్లు– అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, భూహక్కులు, మహిళా భద్రత, ఆదివాసుల పునరావాసం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ, రాజ్యాంగబద్ధ పాలన వంటి అంశాల్లో సివిల్ సర్వెంట్లు అలక్ష్యంగా వ్యవహరించిన అనేక ఉదాహరణలు కనిపిస్తున్నాయి. పలు ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు, గణాంకాల్లో మాయలు, స్థానిక సిబ్బందిపై పర్యవేక్షణ లోపాలు స్పష్టంగా బహిర్గతమవుతున్నాయి. వ్యక్తిగత వైఫల్యాలతో పాటు, పాలనలో బలహీనతలు, రాజకీయ జోక్యం, స్వతంత్ర నిర్ణయాలను వేయడం, ఉద్యోగ స్థిరత్వానికి భరోసా లేకపోవడం, అవినీతి, నిర్లక్ష్యం, స్వీయ చొరవ లేమి తదితర అంశాలు ఇందుకు కారణాలు. వీటికి పరిష్కారాలేంటి?

తీర్పుల అమలేదీ?

సివిల్ సర్వీసుల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించే విషయంలో సుప్రీంకోర్టు రెండు కీలక తీర్పులిచ్చింది. 2006లో ప్రకాష్ సింగ్ కేసులో పోలీసు వ్యవస్థను రాజకీయ పిడికిలి నుంచి విడిపించేందుకు స్టేట్ సెక్యూరిటీ కమిషన్ ఏర్పాటు, అధికారులకు నిర్దిష్టకాలం పాటు స్థిరమైన సేవాకాలం, నియామకాల్లో పారదర్శకత వంటి ఏడు మార్గదర్శకాలను వెలువరించింది. 2013లో టీఎస్ఆర్ సుబ్రహ్మణియన్ కేసులో ఐఏఎస్‌లకు ఉద్యోగ స్థిరత్వం, రాతపూర్వక ఆదేశాల ఆవశ్యకత, రాజకీయ ప్రభావానికి తావులేని వ్యవస్థపై స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది. ఆ తీర్పులు ఇప్పటికీ పూర్తిగా అమలుకు నోచుకోలేదు. పాలనా వ్యవస్థలో మార్పులు రావాలంటే ఆ ఆదేశాలను కేవలం న్యాయపత్రాలుగా కాకుండా మేలిమి సూత్రాలుగా మలచాల్సిన అవసరం ఉంది. అయితే, రాజకీయ నాయకులు ఆ తీర్పులను అమలు చేస్తే సివిల్ సర్వీస్ అధికారులపై తమ నియంత్రణ సడలుతుందేమోనని జంకుతున్నారు. అంతిమంగా దానివల్ల దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి విఘాతం కలుగుతుందని తెలిసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కేంద్రం–రాష్ట్రాల సంబంధాలు సైతం సివిల్ సర్వెంట్ల వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఐఏఎస్ అధికారులను కేంద్రానికి తెచ్చేలా 2022లో ఐఏఎస్ కేడర్ నియమాలపై ప్రతిపాదించిన మార్పులు విమర్శలకు దారితీశాయి. అవి సమాఖ్య వ్యవస్థకు విఘాతకరమని, ఐఏఎస్‌లను ఇరువైపులా ఒత్తిడికి గురిచేస్తాయన్న విశ్లేషణలు వెలువడ్డాయి.ప్రస్తుతం సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్వీసులు, కేడర్లను వారి ర్యాంకులు, పరీక్ష ఫలితాలకు ముందిచ్చిన ప్రాధాన్యతల ఆధారంగా కేటాయిస్తున్నారు. ఈ విధానం అనంతర కాలంలో వారి పనితీరుపై ప్రభావం చూపుతుందన్న అభిప్రాయాలున్నాయి. దీనికి పరిష్కారంగా ఐఐటీలు, వైద్య కళాశాలలు అనుసరించే కౌన్సిలింగ్ విధానం మాదిరిగా సివిల్స్ అభ్యర్థులు తమ సర్వీసులు, కేడర్లను వారి ర్యాంకులు, అభిరుచులు, అందుబాటులో ఉన్న అవకాశాలను బట్టి ప్రత్యక్షంగా ఎంపిక చేసుకోగలగాలి. తద్వారా అంకిత భావంతో పనిచేసి మెరుగైన సేవలు అందించే వీలుంటుంది. ప్రస్తుతం సివిల్ సర్వెంట్ల బదిలీలు, నియామకాలు చాలావరకు రాజకీయ ప్రోద్బలంతో జరుగుతున్నాయి. ఇది వారిలో నిరాశను పెంచడంతో పాటు నాయకుల ప్రాపకానికి పాకులాడేలా చేస్తోంది. ఈ దుస్థితిని నివారించాలంటే ఉద్యోగంలో చేరినప్పటి నుంచే నిర్మాణాత్మక కెరీర్ ప్లానింగ్ ఉండాలి. ఆయా అధికారుల నైపుణ్యం, ఆసక్తి, సామాజిక అవగాహన ఆధారంగా బాధ్యతలను ప్రణాళికాబద్ధంగా అప్పగించాలి. ఇది రాజకీయ జోక్యాన్ని నివారించడంతో పాటు పాలనా స్థిరత్వానికి తోడ్పడుతుంది.ప్రస్తుతం సివిల్ సర్వెంట్ల పనితీరును సమీక్షించే మూల్యాంకన విధానం(పీఏఆర్) కేవలం పైస్థాయి అధికారుల అభిప్రాయంమీదే ఆధారపడి ఉంటోంది. కాలక్రమేణా ఇది స్వీయ చొరవకు అవరోధంగా మారింది. దీనికి బదులుగా ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల అభిప్రాయం, సహచరుల స్పందన, సమస్యలపై సంబంధిత అధికారి ప్రతిస్పందన వంటి అంశాల ఆధారంగా పనితీరును అంచనా వేయాలి. దాన్నిబట్టి పదోన్నతులు, బదిలీలు, బాధ్యతల కేటాయింపులు జరగాలి.

పునర్నిర్మాణం అవసరం

భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణ ధర్మాన్ని నిలబెట్టేది ధైర్యవంతులు, నిష్పక్షపాతులు, సమాజంతో మమేకమయ్యే సివిల్ సర్వెంట్లే. పునర్నిర్మాణంలో 'స్వచ్ఛత, సమగ్రత, న్యాయబద్ధత, సేవాభావం' అనే నాలుగు విలువలు వారికి శిరోధార్యం కావాలి. అభ్యర్థుల ఎంపికలో నైతికత, నియామకాల్లో పారదర్శకత, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, రాజకీయ ప్రభావాన్ని నిలువరించడం ద్వారా సివిల్ సర్వీసుల వాస్తవ పునర్నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. అంతేకాకుండా, ఉద్యోగుల స్వీయ గౌరవానికి భరోసానిచ్చే వ్యవస్థ ఏర్పడుతుంది. సింగపూర్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలు అధికారుల పారదర్శక నియామకాలు, వారికి నైతిక బాధ్యత అలవరచడం ద్వారా అభివృద్ధిలో దూసుకుపోగలిగాయి. భారత్ వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలి. పాలనా సంస్కరణలను వెంటనే అమలులోకి తేవాలి. సివిల్ సర్వీసులు ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా నిలవాలంటే వాటి మార్పు అత్యావశ్యకం. కాలం మనల్ని పరీక్షిస్తోంది. ఇప్పుడు స్పందించకపోతే రేపటి ప్రజాస్వామ్యం శక్తి కోల్పోతుంది. అంతటి దౌర్భాగ్యం దాపురించకుండా సమగ్ర కార్యాచరణ తక్షణం పట్టాలకెక్కితేనే సర్దార్ పటేల్ కలలుగన్న 'ఉక్కుచట్రం' మళ్లీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటుంది.

# ఖజానాను దెబ్బతీస్తున్న ఉచితాలు...



న్యూఢిల్లీ, నగదు బదిలీ పథకాలు ఇప్పుడు దేశాన్ని అప్పుల ఊబిలో నెడుతున్నా.. వాటిపై అజమాయిషీ లేకుండా పోతోంది. పోటీపడి నేతలతంతా నగదు బదిలీ పథకాలను అనుసరిస్తు న్నారు. వాటిని ఇంకా కొనసాగించాలని చూస్తున్నారు. ఇవి ఎత్తేస్తే ఎక్కడ తమ పీఠం కదిలిపోతుందో అన్న భయంలో పేదల జపం చేస్తున్నారు. దేశంలో మరో వందేళ వరకు పేదరికం ఉండాలని కోరుకుంటున్నారు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా పథకాలను ప్రవేశ పెడుతున్నారు. పేర్లు వేరయినా అందరి లక్ష్యం ఓట్లబేరమే అని చెప్పకతప్పదు. ఉచిత పథకాలపై అప్పుడప్పుడూ సుప్రీంకోర్టు చివాట్లు పెడుతున్నా మార్పు రావడం లేదు. కిలో రూపాయికే బియ్యం, వీటయితే సన్నబియ్యం. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, పుచిత పెన్షన్, ఉచితబీమా, ఉచితం పేరుతో మరెన్నో పథకాలు అమలవుతున్నాయి. ప్రజలు ఉచితాలకు అలవాటు పడి పనులకు వెళ్లడం లేదు. నిరుద్యోగం పెరుగుతోంది. ఇలా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పథకాలతో ఖజానాలను ఖాళీ చేస్తున్నాయి. ఓటుబ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతూ ఇదే అభివృద్ధి అని దేశాన్ని మభ్యపెడుతున్నాయి. ప్రత్యేకంగా ఎపిలో డబ్బుల పందేరంతో ఆర్థికంగా దివాళా దిశకు చేరుకుంది. జగన్ హయాంలో పథకాల పేరుతో నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బులు జమచడంతో ఇప్పుడు ఎపిలో వడ్డీలు కట్టలేక చస్తున్నారు. తెలంగాణలో కూడా దుబారాను అరికట్టే ప్రయత్నాలు మాత్రం చేయడం లేదు. కిలో రూపాయి బియ్యం పథకం దుబారా ద్వారా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. ఈ పథకాన్ని రెండు తెలుగు రాష్ట్రాలు గొప్పగా చెప్పుకుంటున్నాయి. రైతుబంధులో భూములు ఉన్నా వ్యవసాయం చేయని వారికి కూడా పంపిణీ చేశారు. ఇలాంటి దుబారాను అరికడితే ఖజానాపై భారం తగ్గుతుంది. కానీ ఈ దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఎపిలో అయితే ఇక అభివృద్ధి అన్నది ఏ మాత్రం కనిపించకుండా పోయింది. . దుబరా పథకాలతో రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించట్లేదు. ఉచిత పథకాలు ఇలాగే కొనసాగితే ఆర్థిక సంక్షోభం తప్పదన్న హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. రాష్ట్రాలు ప్రకటిస్తున్న పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ మాత్రం జరగడం లేదు. వ్యవసాయ రుణమాఫీ వంటి ఆర్థికంగా అలివిగాని హామీలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలంగాణ రెవెన్యూ ఆదాయంలో 35 శాతం మేర జనాకర్షక పథకాలకే ఖర్చవుతోందని ఎస్‌బీఐ గతంలో ఓ నివేదికలో పేర్కొంది. ఇది ఎక్కువ కాలం సాధ్యం కాదని.. ఆర్థిక విపత్తుకు కారణమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఒక్క తెలంగాణే కాదు.. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలు తమ రెవెన్యూ ఆదాయంలో 5 నుంచి 19 శాతం దాకా ఉచిత,జనాకర్షక పథకాలకే ఖర్చు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల సొంత పన్ను ఆదాయాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఆ ఖర్చు ఏకంగా 63 శాతం దాకా కూడా ఉంటున్నట్టు ఆ నివేదిక స్పష్టం చేసింది. జీఎస్‌డీపీలో నాలుగు శాతానికి పైగా ఆర్థిక లోటుతో.. ఆరు రాష్ట్రాల పరిస్థితి ప్రమాదం అంచున ఉన్నట్టు హెచ్చరించింది. అలాగే.. ఏడు రాష్ట్రాల ఆర్థికలోటు వాటి బ్జడెట్ లక్ష్యాలను మించిపోగా.. 11రాష్ట్రాలు మాత్రం ఆర్థికలోటును బడ్జెట్ లక్ష్యాలకు దిగువన లేదా సమానంగా ఉంచగలిగినట్టు ఎస్‌బీఐ తన నివేదికలో పేర్కొంది.అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, అసోం, బిహార్ రాష్ట్రాలు బ్జడెట్ అంచనాలకు మించి ఆర్థికలోటును ఎదుర్కొంటున్నట్టు వెల్లడించింది. అదే సమయంలో.. ఏపీ, అసోం, గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు జీఎస్‌డీపీ వృద్ధిని.. స్థూలజాతీయోత్పత్తి (జీడీపీ) కన్నా ఎక్కువగా చూపుతున్నట్టు పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న గణాంకాల మధ్య తేడాల గురించి ప్రస్తావించింది. ఇలాంటి తేడాలు గతంలోనూ ఉండేవని అభిప్రాయపడింది. కేంద్రం నుంచి వచ్చే జీఎస్టీ ఆదాయం పలు రాష్ట్రాల పన్ను ఆదాయంలో ఐదో వంతు దాకా ఉంటోంది. దాంట్లో అధిక భాగం ఉచితాలకే ఖర్చవుతోంది.

# ప్రభుత్వంతో గిచ్చి కయ్యాలు!

హైదరాబాద్,ఇటీవల స్మిత సబర్వాల్ తరచూ వివాదాల్లోకి దిగుతున్నారు. ఆమె ప్రభుత్వంతో గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూస్తున్నట్టుగా కనిపిస్తున్నది. మామూలుగానే సివిల్ సర్వీసులలో అధికారుల భావప్రకటన స్వేచ్ఛకు కొన్ని పరిమితులు ఉంటాయి. 1923 అధికార రహస్యాల చట్టం (అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్) ప్రకారం ఐఎఎస్ అధికారులు ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించే అవకాశం ఉన్న ప్రకటనలు చేయడం నిషిద్ధం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లయితే సర్వీస్ కండక్ట్ రూల్స్‌ను ఉల్లంఘించినట్టుగా పరిగణిస్తారు. అటువం టి సందర్భాలలో అలాంటి ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై క్రమశిక్షణ చర్యలే కాకుండా వాళ్ళ ర్యాంకును తగ్గించడం లేదా సర్వీసులోంచి తొలగించడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇందులో కూడా మినహాయింపులు ఉండొచ్చు. ఒక అధికారి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని, తప్పుడు పనులను వెలికితీసినట్టయితే విజిల్ బ్లోయర్ చట్టాలకింద అటువంటి అధికారులకు రక్షణ లభించే అవకాశం ఉంటుంది.ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, 'ఆయనను హత్య చేసి ఉండేవాడిని' అన్న వ్యక్తి ఇంటర్వ్యూ ప్రసారం చేసి, అందుకు సంబంధించిన కేసులో అరెస్టయి, బెయిల్ మీద బయటకు వచ్చిన ఒక మహిళ చేసిన ట్వీట్‌ను స్మిత సబర్వాల్ రిపీట్ చేశారు. ఆ మహిళ తన పోస్ట్‌లో 'ఫ్రీ స్పీచ్.. తెలంగాణ మోడల్' అనే శీర్షిక తో ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా ట్వీట్ చేస్తే, దాన్నే స్మిత రీపోస్ట్ చేశారు. అఖిల భారత సర్వీసుల కాంట్రాక్ట్ రూల్స్ -1968 ప్రకారమైనా, 1923- అధికార రహస్యాల చట్టం కిందనైనా స్మిత సబర్వాల్ ఈ ట్వీట్‌ను రీపోస్ట్ చేసి ఉండకూడదు.స్మిత సబర్వాల్ తాజాగా మరో ట్వీట్ చేసారు. గచ్చిబౌలి పోలీసులకు సహకరించాననీ, చట్టాన్ని గౌరవించే పౌరురా లిగా కర్తవ్యాన్ని నెరవేర్చానని చెపుతూనే తనను ఏ పోస్ట్ విషయంలో అయితే నోటీసు ఇచ్చి పిలిపించారో అదే పోస్ట్ మరో రెండు వేలమంది షేర్ చేశారనీ, వాళ్ళందరి మీద కూడా ఇదే చర్యలు తీసుకుంటున్నారా? అని అడిగానని పేర్కొన్నారు. 'అలా చెయ్యక పోతే కొద్దిమందిని ఎంచుకుని టార్గెట్ చేస్తున్నారనే అభిప్రాయం కలుగుతుంది, చట్టం ముందు అందరూ సమానులే. అందరికీ సమన్యాయం జరగాలన్న సూత్రానికి భంగం వాటిల్లుతుంది' అని కూడా స్మిత పేర్కొన్నారు. ఆ రెండు వేల మందీ స్మిత సబర్వాల్ లాగా సివిల్ సర్వీస్ అధికారులు కారు కదా.స్మిత సబర్వాల్ రాజకీయాల్లో చేరతారేమో.. అందు కోసమే ఇలా ప్రభుత్వంపట్ల కవ్వింపు చర్యలకు దిగు తున్నారేమో అనే చర్చ కూడా ఉన్నది. అందులో తప్పేం లేదు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాల్లోకి వెళ్లే అవకాశం ఉన్నది. గతంలో రాజ కీయాల్లో చేరిన ఐఎఎస్ లు, ఐపిఎస్‌లు చాలా మంది ఉన్నారు. సొంతంగా పార్టీలు పెట్టిన వాళ్ళు కూడా ఉన్నారు. ఐఎఎస్ ఎవిఎస్ రెడ్డి మొదలుకొని ఐపిఎస్ ప్రవీణ్ కుమార్ వరకూ పలువురు సివిల్ సర్వీస్ అధి కారులు రాజకీయాలలో తమ భవిష్యత్తును తేల్చుకు నేందుకు అర్ధంతరంగా రాజీనామా చేసి వెళ్లినవాళ్లే. అటువంటి ఆలోచన ఏదైనా స్మిత సబర్వాల్‌కు ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు.కంచ గచ్చిబౌలిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రయత్నం వివాదాస్పదమై సుప్రీం కోర్టు దాకా వెళ్ళిన విషయం మనందరికీ తెలిసిందే. దాదాపు రెండు వేల ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందినదా, రాష్ట్ర ప్రభుత్వం సొంతమా అనే విషయం సుప్రీం కోర్టులో తేలాల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు కూడా విన్న తర్వాత దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఏం తీర్పిస్తుందో చూద్దాం. బంతి సుప్రీం కోర్టులో ఉన్నది కాబట్టి ఇప్పుడు దానిగురించి ఎవరూ బయట మాట్లాడటం సమంజసం కాదు. ఈలోగా కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో మళ్లీ ఒకసారి మనం సామాజిక మాధ్యమాలుగా చెప్పుకుంటున్న సోకాల్డ్ సోషల్ మీడియా వేదికల గురించి మాట్లాడుకోవాల్సి వస్తున్నది.ఎక్స్ (ట్విట్టర్), ఫేస్ బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ వగైరా వగైరా సామాజిక వేదికల వల్ల ఎంత ఉపయోగం ఉంటుందో సమాజానికి అంతే నష్టం జరగడంకూడా మనం చూస్తున్నాం. ఇటీవల కొంతకాలంగా దీనిమీద చర్చ కూడా జరుగుతున్నది. దీనిని మీడియా అనడానికి వీలు లేదనే చర్చ బలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. భావప్రకటన స్వేచ్ఛపేరిట ఎవరికి తోచినట్టువారు, ఎలాపడితే అలాంటి భాషవాడుతూ వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా మాట్లాడుతున్నారనే విమర్శ ఉంది.మామూలుగా ప్రధాన స్రవంతి మీడియాకు ఉన్న స్వీయ నియంత్రణలు గానీ, ఇతర చట్టాలు



గానీ ఈ సామాజిక వేదికలకు లేవు. ఇక అసలు విషయానికి వస్తే, సామాన్యులకు ఈ విషయంలో పెద్ద అవగాహన లేకపోవచ్చు. కానీ సివిల్ సర్వీసులలో దేశంలోనే నాలుగవ ర్యాంకు తెచ్చుకొని, ప్రతిభావంతురాలైన అధికారిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఒక ఐఎఎస్ అధికారి ఈ సామాజిక వేదికలమీద స్పందిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది.ఇక్కడ రెండు రకాలవాళ్లు ఉంటారు. సామాజిక వేదికలమీద స్పృహ తెలియకుండా ఇష్టమైన రీతిలో ఎవరి గురించయినా వ్యాఖ్యానాలు చేసేవాళ్లు, ఇతరులు చేసిన వ్యాఖ్యానాల మీద తమ 'గోడల'పై ప్రచారం చేసేవాళ్లు మొదటి కోవకు చెందినవాళ్లు. రెండో రకానికి చెందినవాళు .. బాధ్యత గల అధికారులు. వీళ్లకు కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. ఏదిపడితే అది మాట్లాడకూడదు. ముఖ్యంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీరు మాట్లాడటానికి, రాయడానికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఇక్కడ మనం మాట్లాడుకుంటున్నది స్మిత సబర్వాల్ అనే ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి గురించి. ప్రతిభావంతురాలైన అధికారిగా ఆమెకు చాలా మంచి పేరు ఉన్నది. ఐఎఎస్ అధికారిగా ఆమె చేసిన ప్రజాసేవకు పలు అవార్డులు కూడా లభించాయి.దాదాపు పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆమె కీలకమైన పదవి నిర్వహించారు. అయితే ఇటీవల ఆమె తరచూ వివాదాల్లోకి దిగుతున్నారు.ఆమె ప్రభుత్వంతో గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూస్తున్నట్టుగా కనిపిస్తున్నది. మామూలుగానే సివిల్ సర్వీసులలో అధికారుల భావప్రకటన స్వేచ్ఛకు కొన్ని పరిమితులు ఉంటాయి. 1923 అధికార రహస్యాల చట్టం (అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్) ప్రకారం ఐఎఎస్ అధికారులు ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించే అవకాశం ఉన్న ప్రకటనలు చేయడం నిషిద్ధం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లయితే సర్వీస్ కండక్ట్ రూల్స్‌ను ఉల్లంఘించినట్టుగా పరిగణిస్తారు. అటువంటి సందర్భాలలో అలాంటి ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై క్రమశిక్షణ చర్యలే కాకుండా వాళ్ళ ర్యాంకును తగ్గించడం లేదా సర్వీసులోంచి తొలగించడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇందులో కూడా మినహాయింపులు ఉండొచ్చు. ఒక అధికారి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని, తప్పుడు పనులను వెలికితీసినట్టయితే విజిల్ బ్లోయర్ చట్టాలకింద అటువంటి అధికారులకు రక్షణ లభించే అవకాశం ఉంటుంది.1968 ఆల్ ఇండియా సర్వీసుల ప్రవర్తన రూల్స్ ప్రకారం సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రభుత్వాన్ని గానీ, ప్రభుత్వ విధానాలను గానీ బహిరంగంగా విమర్శించకూడదు. ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చే అవకాశం ఉన్న ప్రకటనలు చేయకూడదు. అది సీనియర్ ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్ పట్టించుకున్నట్లు లేరనే సంగతి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే విధంగా ఆమె ఈ వేదికల మీద రీపోస్ట్ చేస్తున్న విషయాలవల్ల ఎవరికైనా అర్థం అవుతుంది. ఇంతకుముందే చెప్పినట్టు ఈ సామాజిక వేదికలని తరచూ ఉపయోగించుకునే స్మిత సబర్వాల్ గతంలో ఒకసారి దివ్యాంగులు సివిల్ సర్వీసులకు పనికిరారని తన అభిప్రాయాన్ని వేదికల ద్వారా ప్రచారం చేసి వివాదంలోకి దిగారు. అంతకంటే ముందు కొద్ది సంవత్సరాల క్రితం ఒక ప్రముఖ జాతీయ ఆంగ్ల వారపత్రిక హైదరాబాద్ ప్రతినిధి రాసిన సరదా కాలమ్‌కు ఆ పత్రిక కార్టూనిస్ట్ వేసిన క్యారికేచర్ మీద మండిపడి పరువు నష్టం దావా వేశారు. ఆ క్రిమినల్ డిఫమేషన్ కేసు ఇప్పటికీ ఇంకా కోర్టులో నలుగుతున్నట్టుంది. ఆ క్యారికేచర్లో ఒక మహిళా అధికారిని అలా చిత్రించడం అభ్యంతరకరమే. దీనికి ఆ జాతీయ వారపత్రిక బహిరంగంగానే తన పత్రిక ద్వారా విచారాన్ని వ్యక్తం చేసింది. 2017 జులై ఆరో తేదీ సంచికలో ఆ ఆంగ్ల వారపత్రిక నో బోరింగ్ బాబు అనే శీర్షికతో ఒక వ్యంగ్య వ్యాఖ్యానాల కాలంలో స్మిత సబర్వాల్ గారి పేరు కూడా లేకుండా ప్రచురించిన వ్యాఖ్యానం, కార్టూన్ రెండింటిపట్ల యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది.

# మృత్యు మార్గంగా మారిన హైవే

కర్నూలు,కర్నూలు హైవే మృత్యుమార్గమైంది. హైవే ప్రమాదాలు జిల్లాలో మామూలయ్యాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. హైవేపై వేగం నియంత్రణ నిబంధనలు పాటించక పోవడమే దీనికి కారణం. దీంతో భద్రత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. అంతులేని వేగంతో వాహనాలు దూసుకెళ్లి రోడ్డు పైన నెత్తురు చిందుతున్నాయి. రహదారి నిబంధనలేవీ అమలు కావడం లేదు. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. తరచూ ఎక్కడో ఒక చోట ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు తప్ప మళ్లీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. వెల్దుర్తి, డోన్, ప్యాపిలి ప్రాంతాల్లోని హైవేలో ఉన్న రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. జిల్లాలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-44 ఉంది. కర్నూలు నుంచి వెల్దుర్తి, డోన్, ప్యాపిలి మీదుగా పోదొడ్డి వరకు జిల్లా హైవే రహదారి ఉంది. ఈ ప్రాంతాల్లోని రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లయ్యాయి. డోన్ పరిధిలో ఆరు హైవే కూడళ్లు ప్రమాదాల నిలయాలయ్యాయి. హైవేపై అతివేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. ప్రమాద కారణం ఇదే. నిబంధనల ప్రకారం హైవేపై వాహనాల వేగం 80 కిలోమీటర్లు మించరాదు. అయితే ఈ నిబంధనను వాహనాల డ్రైవర్లు అసలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయి. హైవేపై వేగనియంత్రణ చేయాల్సిన ఎంవీఐ అధికారులు, హైవే అధికారులు మొద్దునిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవలసివస్తోంది. హైవే అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. హైవేపై పాటించాల్సిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. హైవే మలుపుల వద్ద ప్రమాద సూచికబోర్డులు అసలు కనిపించడం లేదు. మలుపుల వద్ద వేగనియంత్రణ బోర్డులు అడ్రస్ లేవు. వీటికి తోడు హైవే జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో.. వాహనాలు వేగంగా దూసుకొస్తున్నాయి. అదే విధంగా హైవే జంక్షన్‌ల వద్ద తప్పనిసరిగా లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు హైవే జంక్షన్‌ల వద్ద లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే హడావిడి చేసి ఆ తర్వాత వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

# అసలును పోలిన నకిలీ నోట్లు

న్యూఢిల్లీ,దేశంలో దొంగనోట్ల చెలామణి కలకలం రేపుతోంది. దొంగనోట్ల తయారీదారులు అత్యంత పకడబ్బందీగా ముద్రణ చేస్తునట్లు తెలుస్తోంది. నోట్ల రద్దు తరవాత వాటిని చాలవరకు కంట్రోల్ చేసినా, అడపాదడపా పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేయడం మరింత కలకలం రేపింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు– అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు ప్రజలు కూడా అసలేదో, నకిలీ ఏదో తెలుసుకోలేక కంగారు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

# గందరగోళంలో కాంగ్రెస్ శ్రేణులు

కరీంనగర్:రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు తమది అధికార పార్టీ అనే భావనలోనే లేరు. ఈ నియోజక వర్గంలో ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు చెందిన వారు కాగా, ఎంపీ బీజేపీ నుంచి గెలిచారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో లేక ఉత్సవ విగ్రహాలుగా మారారనే భావన పార్టీ శ్రేణుల్లో నెలకొన్నది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించినా జిల్లా మంత్రి ఎవరన్నది మాత్రం బేతాళ ప్రశ్నగా మారింది. ఉమ్మడి జిల్లా పరిధిలో పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఇద్దరు మంత్రులుగా ఉండగా, ఈ ఇద్దరు కూడా రాజకీయ ఆధిపత్యం కోసం పోటీపడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధిష్ఠానం ఏ విషయం తేల్చకపోవడంతో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారిందని వాపోతున్నారు.

ఎవరికి వారే..

ఒకరి వద్దకు వెళితే మరొకరికి కోపం, ఒకరిని కలిసినట్లు మరొకరికి తెలిస్తే రాజకీయంగా కార్డు కట్ అవుతుందనే భయంతో మెదలాల్సిన పరిస్థితి ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ లేదు, మంచికి, చెడుకు కార్యకర్తలను పట్టించుకునే వారు లేరు. అధికార పార్టీలో ఉన్నారనే భావనతో ఏ అధికారి వద్దకైనా ఏ పనికోసమైనా వెళ్లే పరిస్థితి లేదు. దీంతో తాము అధికార పార్టీలోనే ఉన్నామా, తమ ప్రభుత్వమే అధికారంలో ఉందా అనే పరిస్థితిలో కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుమిట్టాడుతున్నారు. సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ముఖ్యమంత్రి నియమించారు. ఈ నియామకం వెనుక మరో మంత్రి శ్రీధర్‌బాబు హస్తం ఉందనే కారణంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దానిని వ్యతిరేకించారు. తన నియామకం తర్వాత మంత్రిని కలవడానికి వెళితే నరేందర్‌రెడ్డితో సానుకూలంగా వ్యవహరించలేదని తెలిసింది. ఇప్పటికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొంటున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఆయనకు ఇవ్వడం లేదని, చివరికి అధికారిక కార్యక్రమాల్లో కూడా వేదిక పంచుకునే పరిస్థితి లేకుండా పోయిందని కార్యకర్తలు అంటున్నారు. గ్రం?థాలయ సంస్థ చైర్మన్ పరిస్థితి అలాగే ఉంది. సత్తు మల్లేశంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పదవిలో నియమించారు. ముఖ్యమంత్రి అనుచరుడిగా సత్తు మల్లేశానికి పేరుంది. ఆయన నియామకంపై కూడా మంత్రి పొన్నం సుముఖంగా లేరని, ఇద్దరి మధ్య సఖ్యత అంతంత మాత్రంగానే ఉందని ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ మంత్రి పొన్నం అనుచర వర్గం నుంచి దూరమయ్యారు. తనకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. కరీంనగర్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వీరంతా వాటికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది.

మంత్రి వర్సెస్ మంత్రి

శ్రీధర్‌బాబు నియోజకవర్గం పెద్దపల్లి జిల్లాలో ఉండగా మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ సిద్దిపేట జిల్లాలో ఉంది.ఆ నియోజక వర్గానికి సంబంధించిన రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి.

# తెలంగాణ గొంతుకకాదు..గొంతు కోసిన పార్టీ బిఆర్ఎస్

రంగారెడ్డి,:తెలంగాణ గొంతుక కాదు.. గొంతు కోసిన పార్టీ బీఆర్ఎస్ అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అర్జెరట్‌గా సీఎం ఎందుకు అవ్వాలో కేటీఆర్ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ వద్దనే కదా ప్రజలు ఇంటికి పంపిందని, ప్రభుత్వం మీద విష ప్రచారం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తుపాకీ రాముడు, అగ్గిపెట్టె- హరీష్, లిక్కర్ కవిత తప్పితే.. పార్టీ పెట్టినప్పుడు ఉన్నోళ్లు ఇప్పుడు ఎవరు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకే రాని కేసీఆర్‌ను మరలా సీఎం చేయాలా?, పదేళ్లు అధికారంలో ఉండి సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేదు అని ఎంపీ చామల ప్రశ్నించారు. రజతోత్సవం ఏ పార్టీదో కేటీఆర్ చెప్పాలి. టీఆర్ఎస్ పార్టీనే లేదు, బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏళ్లు కాలేదు. కేసీఆర్ అర్జెరట్‌గా సీఎం ఎందుకు అవ్వాలో కేటీఆర్ చెప్పాలి. అర్జెరట్‌గా వచ్చి ఏం చేస్తాడు.. పదేళ్లు 7 వేల కోట్లు- అప్పులు చేశారు. మీరు వద్దనే కదా ప్రజలు ఇంటికి పంపింది, ప్రభుత్వం మీద విష ప్రచారం ఎందుకని మండిపడ్డారు. తెలంగాణ గొంతుక కాదు.. గొంతు కోసిన పార్టీ బీఆర్ఎస్. తుపాకీ రాముడు, అగ్గిపెట్టె- హరీష్, లిక్కర్ కవిత తప్పితే.. పార్టీ పెట్టినప్పుడు ఉన్నోళ్లు ఇప్పుడు ఎవరు ఉన్నారు. తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి.. కోట్లు- ఖర్చు చేస్తున్నారు బీఆర్ఎస్ వాళ్లు, బీఆర్ఎస్ వాళ్ల డబ్బులు ఇంటింటికి రావాలి, ప్రజలు వసూలు చేయండి' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. దళితున్ని సీఎం చేస్తా అని మోసం చేసినందుకు కేసీఆర్ సీఎం అవ్వలా?, మూడు ఎకరాలు ఇస్తా అని మోసం చేసినందుకు సీఎంను చేయాలా?, కాళేశ్వరం పేరుతో దోచుకున్నదుకా?, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకే రాని కేసీఆర్‌ను మరలా సీఎం చేయాలా?. కేసీఆర్ మంచి అడ్మినిస్ట్రేటర్ అయితే తెలంగాణ అప్పుల పాలు ఎట్లా అయ్యేది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బదనం చేయడం తప్పితే ఏముంది? మీరు చేసేది. కాళేశ్వరం పేరుతో దక్షిణ తెలంగాణని ఎందుకు పక్కన పెట్టారు. కేసీఆర్ బాపు కాదు. రజతోత్సవంలో ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ దోచుకున్నది అందరికీ తెలుసు. కేసీఆర్..రజతోత్సవంలో బీసీని అధ్యక్షుని చేస్తారని సమాచారం ఉంది. మేము ఆహ్వానిస్తున్నాం. కాంగ్రెస్ చేసిన కులగణన వల్ల బీఆర్ఎస్ పార్టీకి బీసీ అధ్యక్షుని ఆలోచన వచ్చిందని ఎంపీ చామల రైతు మహోత్సవం కార్యక్రమంలో చెప్పారు.

# రాజ్‌కసిరెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు

విజయవాడ,ఏపీ లిక్కర్ స్కామ్ లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్ ఎయిర్ పోర్టులో కేసిరెడ్డిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్ పోర్టు దగ్గర కాపు కాసిన సిట్ అదుపులోకి తీసుకుంది. దుబాయ్ నుంచి హైదరాబాద్ కు వచ్చిన రాజ్ కేసిరెడ్డి. మూడు సార్లు సిట్ నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరుకాలేదు. రేపు విచారణకు వస్తానంటూ ఈ మధ్యాహ్నం ఆడియో విడుదల చేశారు. రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ పై విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది హైకోర్టు. ఇప్పటికే రాజ్ కేసిరెడ్డిపై లుక్ అవుట్ నోటీ-సులు జారీ చేసిన సీఐడీ.. ఇమ్మిగ్రేషన్ సమయంలో ఏపీ పోలీసులకు సమాచారం.. రాత్రికి విజయవాడకి రాజ్ కేసిరెడ్డి ని తీసుకువచ్చే అవకాశం ఉంది. రాజ్ కేసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. సిట్ ఎదుట విచారణకు హాజరు అవుతాననిసోమవారంఆడియో విడుదల చేసిన రాజ్ కేసిరెడ్డి.. ఇప్పటి వరకు నాలుగు సార్లు సిట్ రాజ్ కేసిరెడ్డికి నోటీసులు ఇచ్చినా విచారణకు గైర్హాజరు.. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వచ్చే వారానికి వాయిదా వేయటంతో విచారణకు వస్తున్నట్టు తెలిసిన రాజ్ కేసిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

# మౌనం పై చార్జిషీట్?

హైదరాబాద్,నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేసింది. నిజానికి ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్లో సోనియా, రాహుల్ గాంధీలతో పాటుగా, శ్యామ్ పిట్రోడా, ఆస్కార్ ఫెర్నాండెజ్ పేర్లు కూడా ఉన్నాయి. అయినా ఫోకస్ అంతా ఈ ఇద్దరిపైనే తప్ప మిగిలిన ఇద్దరినీ ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. చివరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా సోనియా, రాహుల్ గాంధీ పై చార్జిషీట్ దాఖలు చేయడాన్ని, తప్పు పడుతున్నారే తప్ప మొత్తంగా చార్జిషీటే తప్పని ఆనడం లేదు. ఇంతవరకు ఎవరిపైనా జరగని మహాపరాధం ఏదో సోనియా, రాహుల్ విషయంలో జరిగిపోయింద న్నట్లుగా మండిపడుతున్నారు. గుండెలు బాదుకుంటున్నారు. మిగిలిన ఇద్దరి గురించి, పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అందుకే.. విషయం తెలిసిన పెద్దలు ఇది అందరికీ తెలిసిన కాంగెస్ నేతల స్వామి భక్తికి, విధేయతకు చక్కని నిదర్శనం అంటున్నారు. అయితే.. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలంతా వీధుల్లోకి వచ్చి పోటాపోటీగా ఆందోళనలు చేస్తున్నారు, బీజేపీ పై విరుచుకు పడుతున్నారు, అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఇంతవరకు ఈ విషయంపై పెదవి విప్ప లేదు. ఒక్క ముక్క మాట్లాడ లేదు. ఈడీ చర్యను ఖండించలేదు. కనీసం, ఒక ప్రకటన అయినా చేయలేదు. ఓ వంక కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మొదలు, నిన్న మొన్నట్లో ఎమ్మెల్సీ అయిన అద్దంకి దయాకర్ వరకూ కాంగ్రెస్ నాయకులంతా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్ షాలపై, అరేయ్ ..ఒరేయ్ స్థాయిలో మండి పడుతున్నారు. అయినా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాత్రం చీమైనా కుట్టినట్లు లేదు. కనీసంలో కనీసం ఒక ఖండన ప్రకటన కూడా చేయలేదు. అసలు తనకు ఏమీ సంబంధం లేని అంశం అన్నట్లుగా.. ఆయన తన పనిలో తాను బిజీబిజీగా ఉన్నారని అంటున్నారు. అయితే.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి దేశంలో లేరు. జపాన్ లో పెట్టుబడుల వేటలో బిజీగా ఉన్నారు. అందుకే ఆయన స్పందించలేదని కొందరు అనుకున్నా, ఎందుకో అది, అంతగా నమ్మబుల్ గా లేదని కాంగ్రెస్ నాయకులే గుసగుసలాడు కుంటున్నారు. అది నిజం కాదు.. కుంటి సాకు మాత్రమే అని కాంగ్రెస్ పెద్దలే అంటున్నారు. నిజానికి.. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యంగా ముఖ్యమైన పదవుల్లో ఉన్నవారు, పదవులు ఆశిస్తున్నవారు ఇలాంటి సందర్భాలను అగ్రనేతల పట్ల విధేయత చూపేందుకు ఒక అవకాశంగా తీసుకుంటారు.కప్పుడు శరద్ పవార్, తారిక్ అన్వర్, పీఏ సంగ్మా, సోనియా గాంధీ విదేశీ మూలాలను ప్రశ్నించిన సమయంలో కొందరు వీర విధేయులు ఏకంగా గాంధీ భవన్ లో అగ్గి పెట్టారు. అంతవరకు ఎందుకు ఇదే నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారిచినప్పుడు ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇప్పుడు కూడా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు నిరసన పేరిట విధేయ ప్రదర్శనలు చేస్తూనే ఉన్నారు. ఈడీ, మోదీలను జాయింట్ గా దుమ్మెత్తి పోస్తున్నారు. గాంధీ కుటుంబం త్యాగాలను ఏకరవు పెడుతూ కన్నీళ్లు కారుస్తున్నారు. అలాగే భవిష్యత్ లో ఇంకా పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే హెచ్చరించారు. ఎటొచ్చి రేవంత్ రెడ్డి మాత్రమే సైలెంట్ గా ఉండి పోయారు.

# స్వామీ ఏమి ఈ క్రిష్టియన్ ప్రేమ! బేసిగ్గా హిందూ ద్వేష భావజాలమా?



న్యూఢిల్లీ,2021లో పరువు నష్టం దావా..2023లో శ్రీవాణి విషయంలో బాబు, పవన్ పై ఆరోపణలు..2024లో లడ్డు నెయ్యి కల్తీ వ్యవహారంలో బాబు వ్యాఖ్యల ఆధారంగా భద్రతపై ప్రశిస్తూ పిటిషన్..2025లో టీటీడీ చైర్మన్ వయసు మళ్లిన మనుషులకు మల్లే ఆవులు సైతం చనిపోతాయన్న కామెంట్లపైనా కేసు వేస్తాననడం..అదే జగన్ పాలనలో కనీసం ఒక్క మాట కూడా అనని స్వామి- అంతర్యం ఏమిటి? అని చూస్తే..పై నాలుగు ఘటనల్లో స్వామి డైరెక్టుగా కానీ.. ఇన్ డైరెక్టుగా కానీ సుబ్రహ్మణ్య స్వామి చంద్రబాబును అటాక్ చేశారనడానికి మన దగ్గరున్న ఆధారాలు. బీజేపీకి ప్రాతినిథ్యం వహించే స్వామి.. చంద్రబాబు, పవన్.. తమ కూటమిలో భాగస్వామ్యం అన్న కనీస జ్ఞానం కూడా లేకుండానే కామెంట్లు ఎందుకు చేస్తుంటారో అర్థం కాదు.. తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం మాత్రమే కాకుండా.. ఆపై కేసులు కూడా వేస్తుంటారు. ఇదే స్వామికి క్రిష్టియన్ జగన్ అంటే వల్లమాలిన అభిమానం. అంతులేని ప్రేమతో కూడిన వాత్సల్యాన్ని కనబరుస్తుంటారు. అదేమంటే జగన్ హయాంలో తాను తిరుమల తిరుపతి దేవస్థానం ఆదాయ వ్యయాలపై కాగ్ ఆడిట్ చేయించాలని కోరగా.. అందుకు ఆయన ఒప్పుకున్నారు. దీంతో స్వామి.. జగన్ ని పల్లెత్తు మాట కూడా అనరని చెబుతారు.కానీ ఇక్కడే స్వామిని అనుమానించాల్సి వస్తోంది. ఇదే స్వామి ఇటు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలను, అటు అక్రమాస్తుల కేసులో జయలలిత వంటి వారిని కోర్టు కీడ్చారు. మరీ ముఖ్యంగా జయ తన పదవి వీడేలా చేసిన ఘనత సుబ్రహ్మహ్మణ్య స్వామిది.సుబ్రహ్మణ్య స్వామికి టీటీడీ అంటే ఎందుకంత ఆసక్తి అంటే తిరుపతి హైందవ ఆధ్యాత్మిక బాంఢాగారం.. అక్కడ ఏ చిన్న తప్పిదం జరిగినా ఒక బాధ్యత కొద్దీ తాను స్పందిస్తానని అంటారాయన. సరిగ్గా అదే సమయంలో సోనియా, జయలలిత వంటి వారి విషయంలో అవినీతి మకిలిని తుదముట్టించే వరకూ తాను నిద్రించేది లేదని.. అంటారు. బేసిగ్గా తాను అంతటి నీతి మంతుడ్నని తెలియ చేస్తుంటారు.ఇక్కడ మరో విచిత్రమైన విషయమేంటంటే చెన్నై మైలాపూర్ లో పుట్టిన స్వామి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు. జయలలిత సైతం అదే సామాజిక వర్గానికి చెందిన వారే. అందుకే ఆమె తానెంతటి సీఎం స్థాయి వ్యక్తినైనా కుంభకోణం వంటి బ్రాహ్మణ ఆధిపత్యం గల నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుంటారు. సాటి సామాజిక వర్గానికి చెందిన జయ అంటే కూడా స్వామికి పడదు. అదేమంటే ఆమె చుట్టూ పేరుకుపోయిన అవినీతే అసలు కారణం అంటారు.సాటి సామాజికవర్గానికి చెందిన జయలలిత పట్ల కూడా అంతటి విద్వేషం కనబరచే స్వామికి జగన్ అవినీతి ఎందుకు కనిపించదు? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాలి. జగన్ పై ఎంతటి అవినీతి ఆరోపణలున్నాయో అందరికీ తెలిసిందే. ఇప్పటికీ ఆయన బెయిలుపై తిరుగుతోన్న అవినీతి కేసుల నిందితుడు. అలాంటి స్వామి కనీసం జగన్ మీద రాంగ్ కామెంట్లు కూడా చేయరు.ఇదే జగన్ తాను క్రిష్టియన్ కావడమే కాదు.. టీటీడీకి కూడా ఒక క్రిష్టియన్ని చైర్మన్ గా చేశారు. అప్పుడు స్వామికి కనీసం నోరు పెగలదు. అంతే కాదు జగన్ ఎప్పుడైనా తిరుమలకు వెళ్తే ఒక క్రిష్టియన్ గా డిక్లరేషన్ ఇవ్వరు. అప్పుడు కూడా స్వామికి ఏదైనా కామెంట్ చేయాలన్న ఆలోచన రాదు. జగన్ సాక్షాత్తూ శ్రీవారి పవిత్రతను మంటగలుపుతూ.. ఇంటి ముందే ఆలయం సెట్ వేశారు. అప్పుడు కూడా స్వామి నోరు మెదపలేదు.I am a devotee of Lord Venkateswara. Tirumala is not just a temple, it is a national treasure for Hindus,, అని చెప్పే సుబ్రహ్మణ్య స్వామికి శ్రీవారి భక్తులపైకి చిరుత పులులను వదులుతుంటే పట్టదు. ఇక వాటిని తరమడానికి చేతి కర్రలను ఇస్తుంటే చోద్యం చూస్తుంటారు. అదేమంటే శ్రీవాణి విషయంలో జరిగే అవకతవకల గురించి బాబు, పవన్ మాట్లాడితే మాత్రం విరుచుకుపడిపోతారు.క్రిష్టియన్ జగన్ కి బ్రాహ్మిన్ స్వామికీ ఉన్న లింకేంటి? ఇరువురి మధ్య ఉన్న సంబంధబాంధవ్యాలేంటి?.. శబరిమల, రామసేతు పరిరక్షణపై పిటిషన్లు వేసి హిందుత్వం అన్నా హైందవ ఆచార వ్యవహారాలకు కించిత్ భంగం కలిగినా.. కేసులతో విజృంభించే స్వామికి.. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ జరిగితే గొడవకు దిగాల్సింది ఎవరితో? రివర్స్ లో ఈ విషయం వెలుగులోకి తెచ్చిన బాబునే తప్పు పడతారు. ఇదెక్కడి విడ్డూరం??? అన్నది శ్రీవారి భక్తులకు వచ్చే అనుమానం. టీటీడీ అంటే హిందూ ధార్మిక సంస్థ అయినప్పుడు అక్కడ 2వేలకు పైగా అన్యమతస్తులు ఉద్యోగాలు చేస్తుంటే స్వామికి ఎందుకు పట్టదు? ఇదే అంశంలో నాటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తీవ్ర స్థాయిలో పోరాడి.. తన సీఎస్ వంటి కీలక పదవిని సైతం కోల్పోయారు. హైందవ ఆలయాల్లో అన్యమతస్తులకు తావు లేదన్న పాయింట్ మీద జగన్ తో బరాబర్ ఫైట్ చేసి.. పక్కకు తప్పుకున్నారు. అంతే తప్ప ఎంతకీ తల వంచలేదు.అలాంటి పేరే గల సుబ్రహ్మణ్య స్వామికి జగన్ అన్నా, ఆయన పాలనలో టీటీడీలో జరిగిన గోల్ మాల్ వ్యవహారాలన్నా ఎందుకు పట్టదన్న ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది. ఇదే టీటీడీ గోశాలలో స్వదేశీ ఆవులనే ఎక్కువగా పెంచి పోషించాలన్న నిబంధన ఉంది. ఇక్కడా ఆ నిబంధనలకు తూట్లు పొడుస్తూ.. జగన్ హయాంలో గో.. గోల్ మాల్ జరిగితే.. స్వామికి కనీసం ప్రశ్నించాలని అనిపించదు. ఇది ఎందుకో తేలాల్సి ఉంది. జగన్ సుబ్రహ్మణ్య స్వామి మధ్య ఏవైనా ఒప్పందాలున్నాయా? లేక మరేదైనా మతలబు దాగి ఉందా? ఆ స్వామివారే వెలికి తీయాలి.. తమ కూటమి ప్రభుత్వ పాలన అన్న కనీస కన్సర్న్ లేకుండా స్వామి చేస్తున్న ఈ ఆధ్యాత్మిక విధ్వంసానికి అడ్డుకట్ట ఎప్పుడో కూడా ఆ వెంకటేశ్వరుడే చెప్పాలని అంటున్నారు పలువురు శ్రీవారి భక్తులు.

## డీఎస్సీ వయోపరిమితిపెంచాలి: రామకృష్ణ

అమరావతి, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ లేఖ రాశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటం హర్షణీయమని లేఖలో పేర్కొన్నారు. 2018 తదుపరి ఇప్పుడు మెగా డీఎస్సీ విడుదల చేయటంతో అభ్యర్థులు వయోపరిమితి గురించి ఆందోళన చెందుతున్నారని.. మెగా డీఎస్సీలో అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచుతూ తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# కృత్రిమ మేధ అద్భుతమా, అనర్థమా?

హైదరాబాద్,కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎఐ) అనే పదం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా చర్చింపబడుతూ విశ్వవ్యాప్త అంశంగా మారింది. ఫోన్‌ని ముఖగుర్తింపుతో అన్‌లాక్ చేసిన క్షణం నుండి ఇష్టమైన వివిధ రకాల స్ట్రీమింగ్ సర్వీసెస్‌పై వ్యక్తిగతమైన సిఫార్సులను చేసే వరకు కృత్రిమ మేధస్సు నిశ్శబ్దంగా తెరవెనుక పనిచేస్తుంది. ఇది మానవ మేధస్సును అనుకరించే, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగిన సాంకేతిక వ్యవస్థ. కృత్రిమ మేధస్సు మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ప్రాక్టికల్ ఆటోమేషన్ వంటి వివిధ సాంకేతిక విభాగాలను కలిగి ఉంటుంది. కృత్రిమ మేధస్సు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. అయితే, మానవ ప్రగతికి దీని ప్రయోజనాలు చాలానే ఉన్నప్పటికీ, దీనిని దుర్వినియోగపరచడం వల్ల మానవ మనుగడకి చాలా అనర్థాలే ఉన్నాయనేది చాలామంది విశ్లేషకుల వాదన.అందుకే, కృత్రిమ మేధస్సు అద్భుతమా లేదా అనర్థమా అనే ప్రశ్నపై సమగ్రంగా చర్చించుకోవడం అవసరం. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని అబ్బురపరుస్తూ మానవ సమాజాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధస్సు వివిధ రంగాలలో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చి అనేక ప్రయోజనాలను సమాజానికి చేకూరుస్తుంది. ఎఐ ద్వారా పరిశ్రమల్లో మానవీయ జోక్యం లేకుండానే పనులు జరిగిపోతున్నాయి.తయారీ, లాజిస్టిక్స్, డేటా ఎనలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ వేగాన్ని పెంచుతోంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల్లో చిప్ డిజైన్, ప్రోగ్రామింగ్ సిస్టమ్స్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. ఎఐ ఆధారిత రోగ నిర్ధారణ వ్యవస్థలు (ఎఐ డయాగ్నోస్టిక్స్) అధిక నాణ్యతతో, తక్కువ సమయంలో వ్యాధులను గుర్తిస్తున్నాయి. కృత్రిమ అవయవాలు (ఆర్టిఫీషియల్ ఆర్గాన్స్) అభివృద్ధి అవుతున్నాయి. స్మార్ట్ వైద్యసహాయ సిస్టమ్స్, రోబోటిక్ సర్జరీలు, ఎఐ -ఆధారిత డ్రగ్ డిస్కవరీ వల్ల చికిత్స మరింత ప్రభావవంతంగా మారింది. ఎఐ ఆధారిత వ్యక్తిగతీకరించిన విద్యా విధానాలు (పెర్సనలైజ్డ్ లెర్నింగ్) విద్యార్థుల విద్యను మెరుగుపరుస్తున్నాయి. బహుభాషా అనువాద సాధనాలు (లాంగ్వేజ్ ట్రాన్స్లేషన్ టూల్స్) విద్యను అందరికీ సులభతరం చేస్తున్నాయి.వర్చువల్ టీచర్లు, చాట్‌బాట్ లెర్నింగ్ అసిస్టెంట్లు విద్యార్థులకు సహాయంగా ఉంటున్నాయి. ఎఐ ఆధారిత మార్కెట్ విశ్లేషణలు వ్యాపార నిర్ణయాలను మెరుగుపరుస్తున్నాయి. ఫ్రాడ్ డిటెక్షన్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో మోసాలను తగ్గిస్తోంది. కస్టమర్ సపోర్ట్‌లో చాట్‌బాట్లు, వాయిస్ అసిస్టెంట్లు మెరుగైన సేవలను అందిస్తున్నాయి. ఎఐ ఆధారిత స్వయంచాలక వాహనాలు (అటానమస్ వెహికల్స్) రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాయి. డెలివరీ డ్రోన్లు, ఆటోమేటెడ్ లాజిస్టిక్స్ ద్వారా సరుకు రవాణా వేగవంతంగా మారింది. స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతున్నాయి. రహదారి భద్రత పెంపు తదితర రంగాల్లో ఎఐ సహకరిస్తోంది. గేమింగ్, కంటెంట్ సజెస్టషన్ సిస్టమ్స్ వంటి వేదికల్లో ఎఐ వినియోగం విపరీతంగా పెరిగింది. ప్రస్తుత సమయంలో అత్యంత ఆధునిక సాంకేతిక విలువలతో, వ్యయంతో నిర్మిస్తున్న భారీ సినిమాలలో కృత్రిమ మేధస్సును విరివిగా వాడుతున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు అనేది ఒక కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంగా మారింది.ఇది మన దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంలో, పరిశ్రమల వృద్ధిలో, ఆరోగ్య సంరక్షణ, విద్య, రవాణా మొదలైన అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అయితే, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సాంకేతికతను దుర్వినియోగం చేయడం వలన కొన్ని అనర్థాలను కూడా మానవ సమాజం ఎదుర్కొనవలసి వస్తుంది. ఎఐ వల్ల మానవులకు పని



అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఆటోమేషన్ వల్ల అనేక ఉద్యోగాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. ముఖ్యంగా కస్టమర్ సపోర్ట్, మాన్యుఫ్యాక్చరింగ్, డ్రైవింగ్ రంగాల్లో పని చేస్తున్నవారికి ఇది ముప్పుగా మారింది. ఎఐ ఆధారిత సర్వైలెన్స్ సిస్టమ్స్ వ్యక్తిగత గోప్యతను ప్రమాదంలో పడేస్తున్నాయి. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా తప్పుడు వీడియోలు, ఫేక్ న్యూస్ సృష్టించడం సాధ్యమవుతోంది. హ్యాకింగ్, సైబర్ మోసాలకు ఎఐ వాడబడే అవకాశముంది. ఎఐ అనేక రంగాల్లో పూర్తిగా ఆధిపత్యం చెలాయిస్తే, మానవ నియంత్రణ తగ్గిపోతుంది.ఎఐ ఆధారిత ఆయుధ వ్యవస్థలు (అటానమస్ వెపన్స్) భవిష్యత్తులో మానవాళికి ముప్పుగా మారవచ్చు. ఎఐ తీసుకునే నిర్ణయాలు ఎల్లప్పుడూ నైతికంగా సరైనవిగా ఉండవు. ఎఐ డేటాను తప్పుగా ఉపయోగించుకుంటే, అన్యాయ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఎఐ ఆధారిత నియామక ప్రక్రియల్లో (హై రింగ్ సిస్టమ్స్) వివక్షత కనిపించవచ్చు. మనుషులు ప్రతి చిన్న విషయానికి కృత్రిమ మేధస్సుపై ఆధారపడుతూ ఉంటే తమ ఆలోచన శక్తిని క్రమక్రమంగా కోల్పోతారు. తద్వారా మనుషుల్లోని అద్భుతమైన సృజనాత్మక శక్తి క్రమక్రమంగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఎఐ ఆధారిత రోబోట్లు, వర్చువల్ అసిస్టెంట్స్ వల్ల మానవ సంబంధాలు దెబ్బతిని మనిషి ఒంటరిగా మిగిలిపోయి తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఏఐ ఆధారిత ఆయుధ వ్యవస్థలు, మోసపూరిత టెక్నాలజీ మానవ సమాజానికి ముప్పుగా మారవచ్చు. కృత్రిమ మేధస్సు అనేది మనిషి సృజించిన ఒక గొప్ప సాంకేతిక అద్భుతం.కృత్రిమ మేధస్సు అద్భుతమా లేదా అనర్థమా అనేది దాని ఉపయోగం, ప్రయోజనాలు, పరిమితులను మనం ఎలా నిర్వహిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. దీనిని సరైన మార్గంలో ఉపయోగించుకుంటే, మానవుని జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అద్భుత సాధనంగా మారుతుంది. కానీ, ఈ ఎఐను ఉపయోగించడంలో నిర్దిష్టమైన నియంత్రణ లేకపోయినా, నైతిక మార్గదర్శక సూత్రాలను పాటించకపోయినా, చట్టపరమైన వ్యవస్థల ఆధీనంలో లేకపోయినా, సాంకేతిక అద్భుతంగా కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు మానవ సమాజానికి ప్రమాదకరమైన అనర్థంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది. అందువల్ల, ఈ సాంకేతిక అద్భుతాన్ని అభివృద్ధి పరిచే దశలోనే సరైన నైతిక మార్గదర్శకాలను అనుసరించేలా, మానవ నియంత్రణ విధానాలను పాటించేలా, చట్టాల పరిమితులకు లోబడి పని చేసేలా దాని సాంకేతిక వ్యవస్థను సృజించాలి. సరైన నిబంధనలను, నైతిక మార్గదర్శక సూత్రాలను, మానవత్వ విలువలను, చట్టపరమైన పరిమితులను పాటిస్తే కృత్రిమ మేధస్సు నిజంగా ఓ అద్భుతమే. పాటించకపోతే సమాజానికి ఓ అనర్థమే.

# ఏ ప్రాతిపదికన పోటీకి దూరంగా ఉన్నారో చెప్పాలి

హైదరాబాద్,నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడంలేదో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ చేయడం లేదో చెప్పాలన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్‌కు తమ పార్టీ కార్పొరేటర్లపై నమ్మకం లేదని.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు వెళ్లొద్దని వారికి చెబుతున్నార న్నారు. మజ్లిస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కైందని ఆరోపించారు. ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయట పెట్టాలనే భాజపా పోటీ- చేస్తోందన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాస, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ- చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికైన కార్పొరేటర్‌లను ఓటు- వేయకుండా బీఆర్ఎస్ బెదిరుస్తుందన్నారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ- చేయడం లేదో చెప్పాలన్నారు. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలోని కాకార్పొరేటర్‌లతో కిషన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ- చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయి. ఎన్ని-కై-న కార్పొరేటర్‌లను ఓటు- వేయకుండా బీఆర్ఎస్ పార్టీ బెదిరుస్తుంది. ఇది తమకు ఓటు- వేసి గెలిపించిన ప్రజలను అవమానించడమే. ఎంఐఎం కోసం ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు- వేయలేదు. బీజేపీని ఓడించేందుకు ఈ రెండు పార్టీలు పోటీ- చేస్తాయి. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయి. సెక్యులర్ అని రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టు-కుని ప్రచారం చేస్తున్నారు. మజ్లిస్ పార్టీ రజాకర్ పార్టీ అవునా? కదా? రాహుల్ గాంధీ చెప్పాలి.మజ్లిస్ పార్టీ మోచేతి నీళ్లు ఎందుకు తాగుతున్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మజ్లిస్‌కు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. 15 నిమిషాల సమయం ఇస్తే వందకోట్ల హిందువుల సంగతి చూస్తామన్న మజ్లిస్ పార్టీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలి. బయట ఈ రెండు పార్టీలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతారు కానీ ఓవైసీ దగ్గర వంగి వంగి సలాంలు కొడతారు' అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఏ ప్రాతిపదికన కేసీఆర్ పోటీ- చేయడం లేదో చెప్పాలి. ఎవరిని గెలిపించడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేటర్‌లను పిలిచి ఓటు- వేయొద్దని ఎందుకు బెదిరిస్తున్నారు. మీకు చీము నెత్తురు ఉంటే ఎంఐఎంకు బహిరంగంగా ఎందుకు ఓటు- వేయరు. మీ బాస్ (ఒవైసీ)ను బుజగించేందుకు దూరంగా ఉండాలని నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ పాత బస్తీలో డిపాజిట్ రాదని తెలిసినా పోటీ- చేసింది.. ఇప్పుడు ఎందుకు పోటీ- చేయడం లేదో చెప్పాలి. మజ్లిస్ పార్టీని తెలంగాణకు ముఖ్యమంత్రిని చేయడానికి ఈ రెండు పార్టీలు పోటీ- పడుతాయి. ఇప్పటికే హైదారాబాద్ నగరంను ఎంఐఎంకు అప్పగించాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# వ్యవసాయం గురించి తెలియకుంటే తెలుసుకోండి

మహబూబ్‌నగర్, తెలంగాణ ప్రజలకు ఎవరో వచ్చి వ్యవసాయం నేర్పించలేదని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. భారత్‌లోని దక్కన్ పీఠభూమి ప్రజలు, అందులోనూ తెలంగాణ ప్రజలే అందరికంటే ముందు తమ నైపుణ్యంతో వ్యవసాయం అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలను నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిది రాజకీయ అపరిపక్వత ప్రదర్శించడమే అని తెలిపారు. తెలియకుంటే తెలుసుకోవాలని, ఇది తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అని పేర్కొన్నారు. కానీ తన అజ్ఞానాన్ని సమాజం మీద రుద్దడం సంస్కార హీనత అని చెప్పారు. దానికి విష్ణు కుండినులు, శాతవాహనులు, ప్రధానంగా కాకతీయ రెడ్డి రాజులు , అటు-పిమ్మట అసఫ్ జాహీ పాలకులు పునాదులు వేసిందని చెప్పారు. వెయ్యేళ్ల క్రితం ఈ తెలంగాణ నేల వరి పండిన ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచానికి వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ నేర్పించింది తెలంగాణ అని స్పష్టం చేశారు. ప్రపంచపు భారీ నీటి పారుదల తొలి ప్రాజెక్టు కట్టింది తెలంగాణలో నిజాం సాగర్‌లో ఉన్నామని అన్నారు. ఇక్కడ ఉన్న వనరులు చూసి బతకడానికి అనేక మంది వలస వచ్చారని.. వలసవచ్చి వారి పద్ధతుల్లో వ్యవసాయం చేసి ఉండవచ్చని అన్నారు. ఆ విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదని.. కానీ వలస వచ్చినవాళ్లు వ్యవసాయం నేర్పారు అన్న మాటలు మాట్లాడటం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అని విమర్శించారు.

# ఇవే కదా కమలనాథా?!

అమరావతి,ఆయన బీజేపీ నాయకుడు.. పైగా ఎమ్మెల్యే. గతంలో రెండు మూడు పార్టీల మారిన అనుభవం.. రాజకీయా లను తనదైన శైలిలో ఎటైనా మలుచుకునే శైలి ఉన్న నాయకుడు. పైగా ఎదురుదాడి చేయడంలో ఆయ న నిష్ణాతుడు. ఇప్పుడు ఇవన్నీరంగరించి.. కీలక విషయాన్ని తనవైపు నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ.. ఇప్పటికే ఆయన చిక్కుల్లో చిక్కుకున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. ఆయనే బీజేపీ ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ చడిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి.

ఏం చేశారు..?

ఉమ్మడి కడప జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ఆదినారాయణరెడ్డి బీజేపీ టికెట్‌పై విజ యం దక్కించుకున్నారు. ఇక, ఆ వెంటనే ఆదాయ మార్గాలపై పడ్డారన్న రచ్చ ఉండనే ఉంది. మాజీ మిత్రుడు, సొంత రెడ్డి నాయకుడు అయినా.. జేసీ ప్రభాకర్‌రెడ్డితోనే తొడగొట్టారు. కట్ చేస్తే.. అప్పట్లో దాని ని సీఎం చంద్రబాబు సర్దిపుచ్చారు. దీంతో ఇక, లాభం లేదని అనుకున్నారో..ఏమో.. ఏకంగా కంపెనీల పైనే పడిపోయారు. స్థానిక అల్ట్రాటెక్ సిమెంటు కంపెనీని బెదిరించినట్టు వార్తలు కోకొల్లలుగా వచ్చాయి.ఇక్కడ సిమెంటుఉత్పత్తి చేసే అల్ట్రాటెక్ కంపెనీ.. ముడి పదార్థాలకు సంబంధించిన కాంట్రాక్టులను స్థానికంగా ఇస్తుంది. వీటిని ఆది నారాయణరెడ్డి అనుచరులు.. బంధువులు కూడా తీసుకున్నారు. ఇక, మరికొందరు వైసీపీ నాయకులు గతంలోనే కుదుర్చుకున్న ఒప్పందాలను కొనసాగిస్తున్నారు. అయితే.. ఇప్పుడు వాటిని కూడా రద్దు చేసి.. అవి తనకే ఇచ్చేయాలన్నది ఆదినారాయణరెడ్డి డిమాండ్. దీనిపై గత వారం రోజులుగా పెద్ద ఎత్తున రగడ జరుగుతోంది.తాజాగా.. ఇవి కేంద్రానికి చేరాయి. అల్ట్రాటెక్ కంపెనీకి బీజేపీ పెద్దలతో నేరుగా సంబంధాలు ఉన్నాయి. దీంతో పైవారికి ఫిర్యాదులు అందడంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఆదిని నిలదీశారు. అంతే.. వెంటనే ఆదియూటర్న్ తీసుకుని.. తిప్పలు పడ్డారు. అసలు తాను అల్ట్రాటెక్ జోలికే వెళ్లలేదని.. తనంటే గిట్టనివారే ఇలా ప్రచారం చేశారని చెప్పారు. అంతేకాదు..

# మోడీ బాబు పవన్ జగన్...వాటే మల్టీస్టారర్ !



న్యూఢిల్లీ,ఈ నలుగురూ ఒకేసారి ఒకే చోట కలిసే వీలుందా. అంటే ఎందుకు కాదు అన్నది వెంటనే జవాబు వస్తుంది. ఆ వెంటనే ఏపీ పాలిటిక్స్ గత దశాబ్దన్నర కాలంగా ప్రత్యర్థుల కంటే భీకర శత్రువులు మాదిరిగా పోరాడుతున్న తీరుని చూసిన వారికి ఇది అసలు జరిగేది కాదు అని కూడా అనిపిస్తున్నారు. వెరీ సింపుల్ గా నో చాన్స్ అనేస్తారు.అయితే ఇది రాజకీయం. కాబట్టి ఏమైనా జరగవచ్చు. అందుకే పై నలుగురూ ఒకేసారి కనిపించేందుకు చాన్స్ ఉంది అని అంటున్నారు. అయితే పై నలుగురిలో ముగ్గురు మోడీ బాబు పవన్ మాత్రం కనిపించడం గ్యారంటీ. ఇదంతా ఎక్కడ అంటే మే 2న అమరావతి రాజధాని పునర్ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుడుతున్నారు.ఆ రోజున ఆయన అమరావతిలో కనీసంగా మూడు గంటల పాటు గడపనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చిన ప్రధాని ఒక గంట పాటు బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తరువాత ఆయన బయల్దేరి వెళ్తారు. మొత్తానికి చూస్తే భారీ ఎత్తున అమరావతి పునర్ నిర్మాణ పనులను ఏపీ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టగా తీసుకుని నిర్వహిస్తోంది.ఇందుకోసం మంత్రుల కమిటీ కూడా చురుగ్గా పనిచేస్తోంది. ఇక అయిదారు లక్షల మందిని నాటి సభకు రప్పించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదిలా ఉంటే అమరావతిలో ప్రధాని ద్వారా శ్రీకారం చుట్టబడుతున్న రాజధాని పునర్ నిర్మాణ పనుల కార్యక్రమాల్లో ఆ సంబరాలలో ప్రతిపక్షాలకూ చోటు కల్పించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది.ఏపీలో ప్రతిపక్షాలు అంటే ముందుగా గుర్తుకు వచ్చేది వైసీపీ. అలాగే కాంగ్రెస్, కమ్యూనిస్టులు. మిగిలిన వారి సంగతి ఎలా ఉన్న ఏడాది క్రితం వరకూ సీఎం గా పనిచేసిన జగన్ ని ఆహ్వానించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అంటే అది రాజకీయ విశేషమే అని అంటున్నారు. ఇప్పటికి పదేళ్ళ క్రితం 2015 అక్టోబర్ 22న అమరావతి రాజధానికి మోడీ శంకుస్థాపన చేశారు. ఆనాటి కార్యక్రమానికి అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ ని ఆహ్వానించారు. కానీ ఆయన అపుడు హాజరు కాలేదు.మరి ఈసారి ఆయన వస్తారా అన్నది పెద్ద చర్చ. అయితే ఏపీకి పదకొండేళ్లుగా రాజధాని అన్నది లేదు కూటమి ప్రభుత్వం దానిని నిర్మించే పనిలో ఉంది. వైసీపీ మూడు రాజధానులు అన్నా జనాలు పట్టించుకోలేదు. పైగా ఏపీకి రాజధాని అవసరం ఉంది. దాంతో జగన్ కనుక ఈ సభకు వస్తే అది వైసీపీకి కూడా మంచిదని అంటున్నారు. అంతే కాదు తాము అమరావతి రాజధానికి వ్యతిరేకం కాదని ఒక బలమైన సంకేతం పంపించినట్లు అవుతుంది అని అంటున్నారు.అది వైసీపీకి ఫ్యూచర్ లో రాజకీయంగా లాభించే వీలు ఉంది అని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీకే గర్వకారణంగా నిలిచే ఇలాంటి కార్యక్రమమాల్లో రాజకీయాలు పక్కన పెట్టి అంతా ఒక్కటే అన్న భావనను దేశానికి పంపించాల్సి ఉందని అంటున్నారు. మరి కూటమి ఆయనకు ఎలా ఆహ్వానిస్తుంది. ఆ ఆహ్వానం మీద జగన్ రియాక్షన్ ఎలా ఉంటుంది. అసలు జగన్ వస్తారా ఈ ప్రశ్నలకు జవాబులు కొద్ది రోజుల్లో తెలుస్తాయి అని అంటున్నారు.

# కేసీఆర్ గారూ.. ఇదేదో పెద్ద చిక్కేనే!



హైదరాబాద్,బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌కు కొత్త చిక్కే వచ్చిపడింది. ప్రస్తుతం ఈ నెల 27న పార్టీ ఆవిర్భవించి.. పాతికేళ్లు అయిన సందర్భంగా పెద్ద ఎత్తున రజతోత్సవాలునిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిని వరంగల్‌లో నిర్వహించాలని ప్లాన్ చేశారు. కానీ, పోలీసుల నుంచి అనుమతులు రాలేదు. దీంతో కోర్టు వరకు విషయం చేరింది. దీనిపై ప్రస్తుతం విచారణ వాయిదా పడింది. ఈ నెల 22 న జరిగే అవకాశం ఉంది.ఇదిలావుంటే.. మరోవైపు.. పార్టీ నాయకుల మధ్య కార్యక్రమం నిర్వహణ విషయంలో సమన్వయ లోపం కనిపిస్తోంది. నాయకులు కార్యకర్తలను పోగేసే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాదు.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా కూడా వ్యవహరిస్తున్నారు. దీంతో వారిని అదిలించి.. కదిలించి.. కార్యక్రమాలు సక్సెస్ చేయడం ఇప్పుడు సవాలుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. మరోవైపు.. తాజాగా.. రాజకీయ విమర్శలు వేడెక్కుతున్నాయి. అంటూ.. కాంగ్రెస్ , బీజేపీల నుంచి ఎద్దేవాలు.. విమర్శలు వినిపిస్తున్నాయి. టీఆర్ ఎస్ పార్టీ పుట్టి ఉంటే.. దానికి పాతికేళ్ల పండగ చేయాల. టీఆర్ ఎస్ పార్టీ లేదాయె. మరి ఎవరికి చేస్తున్రను. నాయకులు మూతి సాగదీసి మరీ నిలదీస్తున్నారు. ఇక, బీజేపీ నాయకుల వాదన కూడా ఇలాన ఉంది. బీఆర్ ఎస్ పార్టీ పుట్టి మూడు శుక్రవారాలు కూడా కాకుండానే రజతోత్సవమా? అంటూ.. ప్రశ్నిస్తున్నారు.ఇక, పాంప్లేట్‌లు, బ్యానర్లలోనూ.. ఏం రాయలన్న విషయంపై సొంత పార్టీ నాయకులు కూడా తర్జన భర్జన పడుతున్నారు. టీఆర్ ఎస్ అని రాయాలా? లేక బీఆర్ ఎస్ అని రాయాలా.. అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి టీఆర్ఎస్ లేదు. ప్రస్తుతం బీఆర్ ఎస్ మాత్రమే ఉంది. కానీ, ఇది పుట్టి పాతికేళు అవలేదు. అయితే.. ఈ రాజకీయ గందరగోళం వెనుక.. బీజేపీ శక్తులు ఉన్నాయని బీఆర్ ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. మొత్తానికి బీఆర్ ఎస్ అనే ఖరారు చేశారు.

# విజయసాయి దాచిన పేర్లన్నీ బయటకు వస్తాయా?



అమరావతి,కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి ఊహించని రీతిలో లిక్కర్ స్కామ్ ను విచారిస్తున్న సిట్ బృందానికి దొరికిపోవడం.. ఈ కేసు విచారణలో మేజర్ బ్రేక్ త్రూ అని అంతా అనుకుంటున్నారు. మంగళవారం విచారణకు వస్తున్నట్టుగా రాజ్ కెసిరెడ్డి సోమవారం పోలీసులకు ఆడియో సందేశం పంపినప్పటికీ.. వారు మాత్రం.. హైదరాబాదు వస్తున్న సమాచారం తెలుసుకుని ఎయిర్ పోర్టులోనే అరెస్టు చేసి విజయవాడ తీసుకువెళ్లారు.మంగళవారం ఖచ్చితంగా వస్తానని ఆయన అక్కడే చెప్పుకున్నప్పటికీ.. వారు ఖాతరు చేయలేదని తెలుస్తోంది. మంగళవారం ఆయనను విచారించి సాయంత్రంలోగా కోర్టు ఎదుట ప్రవేశపెట్టే చాన్సుంది. రిమాండు విధిస్తారు. ఆ తర్వాత కూడా పోలీసు కస్టడీకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. అయితే సిట్ అధికారుల విచారణలో.. కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి అనేక మంది పేర్లను కుంభకోణంలో పాత్రధారులుగా వెల్లడించే అవకాశం ఉన్నదని అంతా అనుకుంటున్నారు.ఇటీవల విచారణకు సాక్షిగా హాజరైన విజయసాయిరెడ్డి పోలీసుల ప్రశ్నలకు సూటిగా సమాధానం ఇవ్వలేదు. ఆ సంగతి ఆయనే బయటకు వచ్చి ప్రెస్ మీట్ లోనే చెప్పారు. అయితే ఆయన దాచిపెట్టిన అనేక పేర్లు రాజ్ కెసిరెడ్డి నుంచి రాబట్టాలని పోలీసులు అనుకుంటున్నట్టు తెలుస్తోంది.ప్రత్యేకించి అప్పటి బెవరరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవ రెడ్డి, ఎక్సయిజ్ అధికారి సత్యప్రసాద్ లతో తొలి రెండు లిక్కర్ పాలసీ తయారీ సమావేశాలు జరిగినట్టుగా ముందు నుంచి ప్రచారం ఉంది. ఆ ఇద్దరినీ పోలీసులు విచారించి వారి వాంగ్మూలాల్లో అనేక విషయాలు తెలుసుకున్నారు. అయితే విజయసాయిరెడ్డిని విచారించినప్పుడు, ఆయన విజయవాడ నివాసంలో జరిగిన రెండో సమావేశంలో జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, మరో ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి కూడా పాల్గొన్నారా అని పోలీసులు అడిగారు. విజయసాయి మాత్రం తనకు గుర్తున్నంత వరకు లేదు అని చెప్పారు.అంత కీలక మైన సమావేశంలో పాల్గొన్న అందరి పేర్లు చెప్పి.. ఆ ఇద్దరి ప్రస్తావన వచ్చేసరికి లేదు అని ఖచ్చితంగా చెప్పి ఉన్నా సరిపోయేది.. కానీ 'నాకు గుర్తున్నంత వరకు లేదు' అని చెప్పడం వలన.. వారి పేర్లను ఆయన దాచిపెడుతున్నారనే అభిప్రాయమే పలువురికి కలుగుతోంది.అయితే, పోలీసులు సమాంతరంగా ఇతరులనుంచి సేకరించిన అనేక వాంగ్మూలాల్లో వారిద్దరి పాత్ర పూర్తిగా ఉన్నట్టుగా కిక్ బ్యాక్స్ ఎలా వసూలు చేయవచ్చుననే ప్లాన్ లో కూడా వారి భాగం ఉన్నట్టుగా తెలుసుకున్నారు. ఇప్పుడు రాజ్ కెసిరెడ్డి ద్వారా వారిద్దరి పాత్రను కూడా అధికారికంగా బయటకు తీసుకురావాలని సిట్ పోలీసులు భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. మొత్తానికి చాన్నాళ్లుగా పరారీలో ఉన్న రాజ్ కెసిరెడ్డి దొరికిపోవడం.. మద్యం కుంభకోణం సంగతి త్వరగా తేల్చడానికి ఉపకరిస్తుందని అంతా అంటున్నారు.

### 8మంది మావోయిస్టుల మృతి

రాంచీ,జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పుల్లో 8మంది మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నరన్న సమాచారంతో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటల సమయంలో లుగు కొండల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసుల కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారని సీఆర్‌పీఎఫ్ అధికారులు వెల్లడించారు. మృతులను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో ఎస్‌ఎల్‌ఆర్, ఇన్సాస్ రైఫిళ్లతోపాటు– భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కాగా, ఈ నెల 14న జార్ఖండ్‌లోని పశ్చిమ సింఘ్‌భమ్ జిల్లాలో 11 మావోయిస్టు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.

# రేవంత్ తో కొట్లాడాలంటే ఆ ఇమేజ్ కోసం కేటీఆర్ !

హైదరాబాద్,తెలంగాణా రాజకీయాల్లో చూస్తే పక్కా మాస్ ఇమేజ్ ఉన్న వారు కేసీఆర్. ఆయన టీడీపీలో ఉన్నపుడు కల్వకుంట్ల చంద్రశేఖరావుగానే పరిచయస్తులు. ఆయన చంద్రబాబు కేబినెట్ లో రవాణా మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన 2000లో టీడీపీకి రాజీనామా చేసి 2001లో తెలంగాణా రాష్ట్ర సమితిని ప్రారంభించేంతవరకూ ఆ పేరుతోనే ఉండేవారు. ఆ తర్వాత సీన్ మొత్తం ఒక్కసారి మారిపోయింది. కేసీఆర్ గా ఆయనకు కొత్త నామకరణం జరిగింది. అంతే కాదు ఆయనలో మాస్ లీడర్ కూడా అపుడే బయటకు వచ్చారు./అలా ఒక వైపు రాజకీయాన్ని మరో వైపు తెలంగాణా ఉద్యమాన్ని మిక్స్ చేస్తూ కేసీఆర్ పద్నాలుగేళ్ల పాటు సాగించిన పోరాటం ఆయనలో వీర లెవెల్ మాస్ లీడర్ ని బయటకు తెచ్చింది. కేసీఆర్ అలా తన మాటలతో ఆవేశంతో తెలంగాణా సమాజాన్ని ఊపేశారు. అయితే ఆయన తర్వాత ఆ తరహా మాస్ ఇమేజ్ ఉన్నది మాత్రం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికే.ఆయన స్పీచ్ కూడా ఆకట్టుకుంటుంది. ఆయన చేసే విమర్శలు వేసే సెటైర్లు అందరినీ ఉర్రూతలూగిస్తాయి. అందుకే ఆయన కూడా మాస్ పల్స్ తెలిసి అందరినీ గెలిచి సీఎం అయ్యారు. ఇక బీఆర్ఎస్ లో కేసీఆర్ తరువాత మాస్ లీడర్ ఎవరు అంటే హరీష్ రావు పేరే చెప్పాలి. ఆయన కూడా అచ్చం తన మేనమామ తరహాలో స్పీచ్ ఇవ్వగలరు. మాస్ ని ఎట్రాక్ట్ చేయగలరు.ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి క్లాస్ లీడర్ గా పేరుంది. ఆయన అమెరికాలో చదువుకుని అక్కడే జాబ్ చేసి తరువాత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన గతంతో పోలిస్తే తనలోని క్లాస్ టచ్ కి మాస్ ని జత చేస్తున్నారు. ఇక విపక్షంలోకి వచ్చాక గత ఏణ్ణర్థం కాలంలో కేటీఆర్ పక్కా మాస్ లీడర్ అవతార్ కోసం విపరీతంగా ప్రయత్నం చేస్తున్నారు.అయితే తెలంగాణా యాస పల్లె పదాలు, సామెతలు పడికట్టు పదాలు అవన్నీ కేసీఆర్ కి పట్టుబడినంతగా కేటీఅర్ కి కుదరడం లేదని అంటున్నారు. అయినా సరే ఆయన తన స్టైల్ ని మార్చుకునేం దుకు చూస్తున్నారు. తెలంగాణా



సమాజంలో మాస్ లీడర్ గా ఎస్టాబ్లిష్ అయితేనే సీఎం పీఠం దక్కుతుదని ఒక లెక్క ఉంది.దానికి ఉదాహరణగా కేసీఆర్ రేవంత్ రెడ్డి కనిపిస్తారు. దాంతో కేటీఅర్ ఆ రూట్ లో వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఒక్కోసారి తన భాషలో కొంత దూకుడు ప్రదర్శిస్తూ రేవంత్ రెడ్డి మీద వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు దాంతో అవి బూమరాంగ్ అవుతున్నాయన్న చర్చ ఉంది.ఏది ఏమైనా ఎక్కడైనా మాస్ పల్స్ పట్టుకుంటేనే పీఠాలు కొట్టగలరు. అలాగని ఊర మాస్ ని కూడా జనాలు ఇష్టపడరు. ఆ పరిధిలూ పరిమితులూ చాలా ఉన్నాయి. ఏపీలో అయితే జగన్ మాస్ ని ఎట్రాక్ట్ చేస్తున్నారు. అయితే ఆయన భాషలో మాస్ అంత ఎక్కువగా ఉండదు, ఇక చంద్రబాబు కూడా మాస్ తో కనెక్ట్ అవుతున్నారు. కానీ దానికి తనదైన మంత్రాన్ని ప్రయోగిస్తున్నారు. సో మాస్ అవతార్ ప్రజలతో సంబంధం ఉన్న సినీ రాజకీయ రంగాలకు ఎంతో అవసరం. అయితే మోతాదు మించితే మాత్రం అవే ఇబ్బందికరం అవుతాయని కూడా విశ్లేషణలు ఉన్నాయి.

# శ్రీవారి ప్రసాదంపై భారీ నింద.. కూటమి పతనం!



తిరుపతి:కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి అత్యంత శక్తిమంతుడు. వడ్డీకాసుల వాడి సొమ్ము తిన్నోళ్లు, అలాగే ఆయనకు ద్రోహం తలపెట్టిన వాళ్ల బతుకు బస్టాండే అనిశ్రీవారి మహిమల గురించి కథలుకథలుగా చెప్పుకుంటుంటారు. అందుకే తిరుమల శ్రీవారి విషయంలో భయభక్తులతో మెలుగుతుంటారు. స్వామి వారికి భక్తులు వివిధ రూపాల్లో సమర్పించే కానుకల్ని, ఆయన చూడలేదని ఎవరైనా దొంగచాటుగా పట్టుకెళ్లినా, మనశ్శాంతి కరువై చనిపోయిన వాళ్లు ఎంతో మంది ఉన్నారు.కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వారి మహత్యం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి బాగా తెలుసు. తిరుమల కొండకు సమీపంలోనే ఆయన స్వగ్రామం నారావారిపల్లె వుంటుంది. అందులోనూ కలియుగ దైవం తమ ఇలవేల్పు అని చంద్రబాబు తరచూ చెబుతుంటారు. అలాంటప్పుడు స్వామి వారిపై అత్యంత భక్తిశ్రద్ధలను చాటుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఎక్కువ వుంటుంది.కానీ ఆయన చేసిందేంటి? శ్రీవారి భక్తులు పరమ పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంపై పేద్ద నింద వేశారనే అప్రతిష్టను మూటకట్టుకున్నారు. వైసీపీ హయాంలో లడ్డూ ప్రసాదంలో పంది, ఆవు తదితర జంతువుల కొవ్వు కలిపి తయారు చేశారని వినడానికి కూడా భరించలేనంత బండరాయి వేశారు. రాజకీయ దిగజారుడుతనానికి ఈ నింద పరాకాష్ట. చివరికి సుప్రీంకోర్టు రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, ఎలాంటి ఆధారాలు లేకుండా స్వామి వారి ప్రసాదంపై దారుణమైన నిందలు వేయడం ఏంటని చీవాట్లు పెట్టింది.ఇదే సాకుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సనాతన అవతారం ఎత్తారు. ఈయన గారు మరో అడుగు ముందుకేసి, ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి, ఆ తర్వాత తిరుమలకు కాలినడకన వెళ్లారు. కాలి నడక మార్గంలో మెట్లకు బొట్లు పెడుతూ తానో పరమ భక్తుడినని చాటుకునేందుకు పవన్ తపించారు.కూటమి ప్రభుత్వం కనీసం పది నెలల పాలన పూర్తి చేసుకునే సరికే, ఐదేళ్ల వ్యతిరేకత సంపాదించుకుందన్న చెడ్డపేరు వచ్చింది. అలాగే కూటమి ప్రజాప్రతినిధుల అరాచకాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. అరికట్టడంలో ప్రభుత్వ పెద్దగా చంద్రబాబు అట్టర్ ఫ్లాప్. ఏ ఒక్క ఎమ్మెల్యే, మంత్రి ఆయన్ను ఖాతరు చేసే స్థితిలో లేరు. మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేసే పరిస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం లేదు. బాబు మాయ మాటలు నమ్మి మోసపోయామనే ఆవేదన ప్రజానీకంలో గూడు కట్టుకుంది. కానీ ఇప్పటికప్పుడు కూటమి సర్కార్‌కు వచ్చే నష్టమేమీ లేదు. ఐదేళ్ల అధికారానికి డోకాలేదు.కానీ మళ్లీ కూటమి తన అధికారాన్ని నిలబెట్టుకుంటుందనే నమ్మకంలో వాళ్లకే లేదు. అసలు చంద్రబాబు మార్క్ పరిపాలన లేనేలేదనే మాట వినిపిస్తోంది. ఇదే పరిపాలన కొనసాగితే వైసీపీ కంటే దారుణమైన ఫలితాలు కూటమి దక్కించుకోవాల్సి వస్తుందనే అభిప్రాయం ప్రభుత్వ అనుకూలంగా ఉండేవాళ్ల నుంచే వ్యక్తమవుతుండడం గమనార్హం. అధికారంలోకి వచ్చిన మొదట్లో కొద్దోగొప్పో పద్ధతిగా వుంటారు. కాలం గడిచే కొద్దీ మరింత విచ్చలవిడితనం పెరగడమే తప్ప, తగ్గేది ఉండదు.ఒక వైపు అధికార కాలం కరిగిపోతుంటే, సంపాదించుకోవాలనే యావలో అరాచకాలకు మరింతగా తెరలేపుతారు. కూటమి పాలన చూస్తున్న వాళ్లెవరికైనా, వైసీపీ పాలనే వంద రెట్లు మేలు అనే అభిప్రాయం కలుగుతోందంటే, ఎలా అర్థం చేసుకోవాలి? అసలు ఎందుకు ఇలా అవుతోందని కూటమి నాయకులే ఆవేదనతో ప్రశ్నించుకునే పరిస్థితి. దీనంతటికి కారణం శ్రీవారి ప్రసాదంపై వేసిన నిందే అనే చర్చ జరుగుతోంది. జగన్ క్రిస్టియన్ కావడంతో రాజకీయంగా తీవ్రమైన దెబ్బ కొట్టేందుకు తిరుమల ప్రసాదాన్ని వాడుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.నిజానికి స్వామి వారి పవర్ ఏంటో చంద్రబాబుకు బాగా తెలుసు. అయినప్పటికీ ఏరికోరి టీటీడీకి తెచ్చుకున్న తన సామాజిక వర్గానికి చెందిన ఒక ఉన్నతాధికారి సలహా మేరకు శ్రీవారి ప్రసాదంపై అలవోకగా నింద వేయడం, ఆ తర్వాత ప్రతిదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఘటనలు చోటు చేసుకోడాన్ని గమనించొచ్చు. స్వామి వారి ఆగ్రహాన్ని కూటమి ప్రభుత్వం అనుభవిస్తోంది. మనుషులే కాదు, తప్పు చేస్తే ప్రభుత్వాలు కూడా స్వామి కోపానికి మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది. కూటమి పతనం ప్రభుత్వంలోని వాళ్లకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. కోట్లాది మంది భక్తులు ఆరాధించే తనను రాజకీయ స్వార్థానికి వాడుకుంటే, శిక్ష ఏ విధంగా వుంటుందో స్వామివారు రుచి చూపిస్తున్నారు.

# కమల దళంలో అంతర్మథనం..కొత్త శకానికి శ్రీకారం?



న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీలో ఏమి జరగుతోంది? జాతీయ అధ్యక్షుని ఎన్నికలో ఎందుకు ఇంత జాప్యం జరుగుతోంది? తెలంగాణ సహా అనేక ఇతర రాష్ట్రల్లో రాష్ట్ర అధ్యక్షుల ఎన్నిక ఎందుకు ముడిపడడం లేదు? అందుకు పార్టీ నేతలు చెపుతున్న కారణాలేనా లేక ఇంకా లోతైన కారణాలు ఏమైనా ఉన్నాయా? అంటే, కమల దళంలో జరగతున్న పరిణామాల వెనక లోతైన కారణాలే ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారంగా తెలుస్తోంది. నిజానికి పైకి కనిపిస్తున్నదానికి లోపల జరగతున్న పరిణామాలకు పొంతనలేదని అంటున్నారు. అవును ఢిల్లీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే.. భవిష్యత్ లక్ష్యాలు, భవిష్యత్ వ్యూహాలు ఆధారంగా ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో అనివార్యంగా చేపట్టవలసిన పెను మార్పులపై లోతైన చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పైకి అంతా బాగుందన్నట్లు కనిపిస్తున్నా, అంతర్గతంగా అనేక అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, అందుకే ఒకదానితో ఒకటి ముడి పడిన కీలక నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని అంటున్నారు. ఇటీవల అటు ఢిల్లీలో ఇటు నాగాపూర్ లో అగ్రనేతల వరస సమావేశాలు కేవలం పార్టీ అధ్యక్షుని ఎన్నికకు పరిమతం కాదని.. అంతకు మించిన అంతర్మథనం జరుగుతోందని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాగపూర్ పర్యటన (మార్చి30) తర్వాత, చోటు చేసుకుంటున్న పరిణామాలు బీజేపీలో ఏదో జరుగుతోందనే అనుమానాలకు మరింత బలం చేకూర్చే విధంగా ఉన్నాయని, అంటున్నారు. అలాగే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంబంధాల విషయంలోనూ పునఃసమీక్ష జరుగుతోందని విశ్వసనీ యంగా తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ వందేళ్ళ పండగను పురస్కరించుకుని, సంఘ్ పరివార్ ఎజెండాలో మిగిలి ఉన్న అంశాలపై మరింత దృష్టి పెట్టాలని ఆర్ఎస్ఎస్ బావిస్తోందని అంటున్నారు .అందులో భాగంగా పార్టీ పైన, ప్రభుత్వం పైన కూడా నాగపూర్ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండేలా, ఢిల్లీ పై నాగపూర్ పట్టు బిగిస్తోందని అంటున్నారు.

### మళ్ళీ ఉప ప్రధాని?

ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇటు బీజేపీలో, అటు ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయని, అంటున్నారు. ఇందులో భాగంగా, గతంలో అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వంలో ఉన్న ఉప ప్రధాని పదవిని పునరుద్దరించే ఆలోచన ఉందని అంటున్నారు. వాజ్ పేయి ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న అద్వానీకి 2002లో ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే పదోన్నతి లభించిందనీ, ఇప్పుడు కూడా, ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే మళ్ళీ ఉప ప్రధాని పదవిని పునరుద్ధరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. అప్పటిలాగా ఇప్పుడు కూడా, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కు పదోన్నతి లభిస్తుందా? ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్, నాగపూర్ ఎంపీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలలో ఒకరిని అదృష్టం వరిస్తుందా? అన్నది తెలియాల్సి ఉందంటున్నారు. నిజానికి, ప్రస్తుతం బీజేపీ ముందున్న ప్రధాన సమస్య, ప్రధాన చిక్కు ముడి ఇదే అంటున్నారు.

### ఈ రోజు ఉప ప్రధాని రేపటి ప్రధాని?

అవును. 2002లో ఉప ప్రధానిగా పదవిని చేపట్టిన అద్వానీ, 2004 ఎన్నికలలో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. అటల్జీ ప్రధానిగా ఉన్న సమయంలోనే అద్వానీని బీజేపీ, ఎన్డీఏ కూటమి ప్రధాని అభ్యర్థిగా ప్రకటించింది. సరే.. ఆ ఏన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ బండి తిరగబడింది. కాంగ్రెస్ సారథ్యంలోని యుపీఏ అధికారంలోకి వచ్చింది. అద్వానీ, ఐదేళ్ళు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. తిరిగి 2009 లోనూ ఆయనే ప్రధాని అభ్యర్థిగా బీజేపీ బరిలో దిగింది. అయితే మళ్ళీ అదే ఫలితం ఎదురైంది. అద్వానీ మరోసారి బస్సు మిస్సయ్యారు. అది వేరే విషయం. అదలా ఉంచితే, ఇప్పుడు మళ్ళీ అదే ఆనవాయితీ కొనసాగితే, ఈ రోజు ఉప ప్రధాని ఎవరైతే వారే రేపటి (2029) ప్రధాని అభ్యర్థి అవుతారు. అందుకే. పార్టీలో ఇంతటి అంతర్మథనం సాగుతోందని, పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే, మోదీ సహా చాలా మంది సీనియర్లు తెరమరుగు అవుతారని, కొత్త తరం తెరపైకి వస్తుందనీ, కమల దళంలో కొత్త శకానికి శ్రీకారం చుడుతుందని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com